టిప్పర్లకు జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలి: కలెక్టర్



మాట్లాడుతున్న నాగరాణి, జేసీ

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇసుక రవాణాకు సంబంధించిన వాహనాల రిజిస్ట్రేషన్ కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. జేసీ రాహుల్ కుమార్‌రెడ్డితో కలిసి ఆమె గురువారం టిప్పర్ల యజమానులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉచిత ఇసుకను ఇళ్లకు తరలించే టిప్పర్లకు డిపాజిట్ల చెల్లింపు, అఫిడవిట్లకు ప్రభుత్వం మినహాయింపునిచ్చిందని వారికి వివరించారు. నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేయాలని, దాని కోసం ప్రతి వాహనానికి జీపీఎస్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. డీఆర్వో ఉదయ భాస్కరరావు, జిల్లా రవాణా అధికారి ఉమామహేశ్వరరావు, భూగర్భ గనుల శాఖాధికారి జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ★ వ్యవసాయం, అనుబంధ రంగాల లబ్ధిదారులకు మెరుగైన ఉపాధి అందించడంలో సాంకేతికత- సౌర విద్యుత్తును వినియోగించుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సీఈఈడబ్ల్యూ ప్రతినిధులు(దిల్లీ), వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. వరి సాగు, ఎండు చేపలు, డైరీ, కోకో వంటి వాటికి సాంకేతికతను, సౌర విద్యుత్తు పరికరాల వినియోగం చేపట్టేలా ప్రయోగాత్మకంగా పరిశోధనలు చేయాలన్నారు. పశువుల దాణా వినియోగ ఖర్చును తగ్గించేందుకు మొక్కజొన్న గింజల ద్వారా సగటున అయిదారు రోజుల్లో పశుగ్రాసాన్ని పెంచుకునే విధానాన్ని సీఈఈడబ్ల్యూ పరిచయం చేస్తుందన్నారు.

రుణమాయ

ఈనాడు, ఏలూరు

బ్యాంకులో రుణాల కోసం కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. సంబంధం లేని భూములు, చెరువులను తామే సాగు చేస్తున్నట్లు తప్పుడు పత్రాలు సమర్పించి భారీగా రుణాలు తీసుకుంటున్నారు. కొందరు అధికారులు ఈ వ్యవహారాల్లో భారీగా ముడుపులు మెక్కేసి అడ్డగోలుగా రుణాలిచ్చేస్తున్నారు. ఫలితంగా నిజమైన యజమానులు అవస్థలు పడుతున్నారు.



నకిలీ కౌలు పత్రాలతో కుంభకోణాలు

బ్యాంకు అధికారుల సహకారంతోనే వ్యవహారం

● ఏలూరు పరిధిలోని సత్రంపాడుకు చెందిన పాలడుగు వెంకటేశ్వరరావు, ఆయన భార్య పేరు మీద పెంటపాడు, ఉంగుటూరు, రావులపర్రు గ్రామాల్లో 9.37 ఎకరాల చేపల చెరువులున్నాయి. 2016 నుంచి వారే సాగుదారులు. దెందులూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి ఆ చెరువులను లీజుకు తీసుకుని సాగు చేస్తున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. వాటిని ఏలూరు గ్రామీణ పరిధిలోని ఓ బ్యాంకులో పెట్టి రూ.12 లక్షల రుణం తీసుకున్నారు. వారం కిందట యజమాని రుణం తీసుకొనేందుకు బ్యాంకుకు వెళ్లగా ఈ చెరువులపై రుణం ఉందని చెప్పటంతో అవాక్కయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

● మండవల్లి మండలానికి చెందిన ఓ లేఖరి కొంత కాలం కిందట భారీ కుంభకోణం చేశారు. బ్యాంకు అధికారులకు ముడుపులు సమర్పించి భారీగా రుణం పొందారు. తన దగ్గరకు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన విలువైన ఆస్తి పత్రాలను కలర్ జిరాక్స్ తీశారు. బ్యాంకు అధికారుల సహకారంతో దాన్ని బ్యాంకులో పెట్టి రూ.50 లక్షలు రుణం పొందారు. కొంతకాలానికి యజమాని రుణం కోసం వెళ్తే అసలు విషయం బయటపడింది.

● గతంలో భీమవరానికి చెందిన కొందరు కృష్ణా జిల్లాలో పొలాలను తాము లీజుకు తీసుకున్నట్లు నకిలీ లీజు పత్రాలు సృష్టించారు. అక్కడ బ్యాంకుల్లో పెద్దఎత్తున రుణాలు తీసుకున్నారు. తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు యజమానులకు నోటీసులు పంపారు. దీంతో అసలు కుంభకోణం బయటపడింది.

అంతా అడ్డదారిలోనే..

సాధారణంగా బ్యాంకుల్లో రుణం ఇవ్వాలంటే తీసుకునేవారి ఆస్తి పత్రాలు తనఖా పెట్టుకుంటారు. చేపలు, రొయ్యల చెరువులు, పెద్ద వ్యాపారాలు చేస్తున్నట్లు చూపిస్తే ఆ పెట్టుబడుల స్థాయిని బట్టి రుణం మంజూరవుతుంది. ఉమ్మడి జిల్లాలో ఆక్వా రైతులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పెట్టుబడుల కోసం కొంత మంది అడ్డదారులు తొక్కుతున్నారు. చెరువుల యజమానులు కౌలుకు ఇవ్వకుండానే ఇచ్చినట్లు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారు. సంతకాలు సైతం ఫోర్జరీ చేస్తున్నారు. వాటిని బ్యాంకులో పెట్టి అధిక మొత్తంలో రుణాలు పొందుతున్నారు. యజమానులు తెలుసుకోనంత వరకు ఏళ్ల తరబడి ఆ పత్రాలు అడ్డుపెట్టుకుని అనేక సార్లు రుణాలు తీసుకుంటున్నారు.

2.40 (లక్షల ఎకరాలు) ఉమ్మడి జిల్లాలో ఆక్వా విస్తీర్ణం

50,000 మొత్తం ఆక్వా రైతులు

రూ.550 కోట్లు ఏడాదికి బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలు

గత అయిదేళ్లలో నకిలీ పత్రాలతో రుణాలు పొందినట్లు పోలీసులు గుర్తించిన ఘటనలు **29**

అధికారులతో కుమ్మక్కై

బ్యాంకు రుణం కోసం దరఖాస్తు చేసినప్పుడు అధికారులు వారి పత్రాలు సవ్యంగా ఉన్నాయా, నిజమైనవా కావా అని చూడాలి. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ఆ శాఖ అధికారులు వెళ్లి పరిశీలించాలి. సదరు వ్యక్తికి యజమాని భూమి కౌలుకు ఇచ్చారా, ఎంత విస్తీర్ణం ఇచ్చారు.. కౌలు మొత్తం ఎంత ఇలా ప్రతి అంశాన్ని నిర్ధారించుకున్న తర్వాతే ఆమోదం తెలపాలి. కానీ చాలా మంది బ్యాంకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది రుణ దరఖాస్తుదారులతో కుమ్మక్కై ఏమీ పట్టించుకోకుండానే రుణాలిచ్చేస్తున్నారు. ప్రతిఫలంగా భారీగా ముడుపులు తీసుకుంటున్నారు. నరసాపురం, భీమవరం, కాళ్ల, ఉండి, కైకలూరు, గణపవరం, నిడమర్రు, ఆకివీడు, ఏలూరు తదితర ప్రాంతాల్లోని ఈ వ్యవహారాలు చాప కింద నీరులా జరిగిపోతున్నాయి. ఉన్నతాధికారులు సైతం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ అంశమై ఎల్‌డీఎం నీలాంద్రిని వివరణ కోరగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కన్నేసి.. పూడ్చేసి..

● యథేచ్ఛగా చెరువుల ఆక్రమణలు ● పట్టించుకోని అధికార యంత్రాంగం



మార్టేరులోని సర్వే నంబరు 8-1లో గుణ్ణం చెరువు 6.17 ఎకరాల్లో ఉన్నట్లు రెవెన్యూ లెక్కలు చెబుతున్నాయి. గత 20 ఏళ్లుగా చెరువు ఆక్రమణకు గురవుతోంది. తొలుత ఒక్కటొక్కటిగా గృహాలు వెలిశాయి. అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో క్రమేణా ఊపందుకున్నాయి. గ్రామంలోని చెత్త ఇందులోనే వేస్తున్నారు. ప్రస్తుతం మూడెకరాలకు పైగా ఆక్రమణల్లో ఉంది.

న్యూస్‌టుడే - ఆచంట, మార్టేరు, నరసాపురం గ్రామీణ: జిల్లాలో చెరువులు ఆక్రమణల చెరలో చిక్కుకుంటున్నాయి. వాటిల్లో అక్రమార్కులు యథేచ్ఛగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. వైకాపా పాలనలో చెరువుల ఆక్రమణలు యథేచ్ఛగా సాగగా- వాటికి అడ్డుకట్ట వేసిన పాపాన పోలేదు. మార్టేరు గుణ్ణం చెరువులో ఇళ్ల నిర్మాణాలకు రెవెన్యూ అధికారులు ఏకంగా ధ్రువపత్రాలు మంజూరు చేశారు. కొందరైతే పంచాయతీ పన్నులు సైతం చెల్లించేస్తున్నారు.



తణుకు: తేతలిలో చెత్తతో నిండిన మంచినీటి చెరువు

వ్యర్థాలతో నింపేసి.. తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలో రెండు మంచినీటి చెరువులుండేవి. ఒక దాంట్లో పంచాయతీ యంత్రాంగమే వ్యర్థాలను నింపేస్తోంది. ప్రజావసరాలకు పూర్తిగా తవ్విన చెరువులను ఎట్టి పరిస్థితుల్లోనూ పూడ్చకూడదు. కానీ, పంచాయతీ సిబ్బందే గ్రామంలో సేకరించిన చెత్త, ఇతర వ్యర్థాలను వాటిల్లో పడేస్తుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలమూరులో ఇప్పటికే ఒక చెరువు పూర్తిగా మాయమైంది. పెనుమంట్రలోనూ ఇటుకలను డంపింగ్ యార్డుగా మార్చేశారు.

జిల్లాలో ఇలా..
407 పంచాయతీలు
274 మంచినీటి చెరువులు
432 ఇతర చెరువులు

ఏకంగా ప్రభుత్వ భవనాల నిర్మాణం.. అత్తిలి, పెనుగొండ, పాలకొల్లు, ఆచంట, వీరవాసరం, పెనుమంట్ర తదితర మండలాల్లోని పంచాయతీ చెరువులపై యంత్రాంగం ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తోంది. కొన్ని చోట్ల ఏకంగా ప్రభుత్వ భవనాలు చెరువు గట్లపై నిర్మించడం వివాదాస్పదంగా మారుతోంది. 'జిల్లాలోని చెరువులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం' అని జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ తెలిపారు.

పసిడి ధరలు పైపైకి



నరసాపురం: బంగారు దుకాణంలో కొనుగోలు దారులు

నరసాపురం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం బంగారంపై దిగుమతి సుంకం, జీఎస్టీ తగ్గించినా మార్కెట్లో మాత్రం రోజు రోజుకూ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొనడంతో బంగారం ధరలపై ప్రభావం చూపుతోంది. బ్యాంకుల్లో డిపాజిట్లపై వడ్డీ రేట్లు కూడా తగ్గించడంతో మదుపుదారులు బంగారు, వెండి కొనుగోలుకు ఆసక్తి చూపుతుండటం కూడా ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.



బంగారం 24 క్యారెట్లు 100 గ్రాముల ధర రూ. లక్షల్లో		కిలో వెండి ధర రూ.ల్లో
గతేడాది సెప్టెంబర్	: 6.60	88,000
వారం కిందట	: 7.28	90,800
ప్రస్తుతం	: 7.62	93,500

తగ్గిన కొనుగోళ్లు.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం బులియన్ మార్కెట్టు అత్యంత కీలకం. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు తదితర ప్రాంతాల్లో సుమారు 800లకు పైబడి బంగారు ఆభరణాల విక్రయ దుకాణాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కార్పొరేట్ సంస్థలకు చెందిన దుకాణా(షోరూము)ల్లో నెలకు సుమారు రూ.30 కోట్లు, రిటైల్ దుకాణాల్లో రూ.50కోట్లు పైబడి క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. నరసాపురంలో 78 బంగారు ఆభరణాల దుకాణాలు ఉన్నాయి. వాటిల్లో సాధారణంగా నెలకు రూ.15 కోట్ల వరకు క్రయ, విక్రయాలు జరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ధరల పెరుగుదల ప్రభావంతో ప్రజలు వెండి, బంగారు ఆభరణాలు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. 'ప్రస్తుతం బంగారం ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో అమ్మకాలు ఆశాజనకంగా లేవు. భవిష్యత్తుపై అంచనాలతో వ్యాపారాలు కొనసాగిస్తున్నాం' అని నరసాపురం బులియన్ వర్తక సంఘం అధ్యక్షులు వినోద్‌కుమార్‌జైన్ చెప్పారు.

ఆర్డీవోలకు స్థానచలనం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆర్డీవోలు, సబ్‌కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. భీమవరం ఆర్డీవోగా కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని నియమించింది. నరసాపురం ఆర్డీవోగా డి.రాజు రానున్నారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న అచ్యుత అంబరీశ్‌ను ఏలూరు ఆర్డీవోగా నియమించారు. తాడేపల్లిగూడెం ఆర్డీవోగా వై.భవానీ శంకరి నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న కె.చెన్నయ్య బదిలీ అయ్యారు.

అనుకున్నదొకటి.. అయ్యిందొకటి!

ఈనాడు కథనానికి స్పందన

సిఫార్సులన్నీ బుట్టదాఖలు

పాలకొల్లు, న్యూస్‌టుడే: బదిలీల విషయంలో అనుకున్నదొకటి అయ్యిందొకటి కావడంతో జిల్లాలో పలువురు రెవెన్యూ అధికారులు విస్తుబోయారు. రెవెన్యూశాఖలో బదిలీలకు సంబంధించి తెర వెనుక జరుగుతున్న పరిణామాలపై 'సిఫార్సులతో చెక్కేస్తే పోలా' శీర్షికన ఈ నెల 24న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు అదేరోజు వెల్లడించాల్సిన బదిలీల జాబితాను తాత్కాలికంగా నిలిపి మళ్లీ వడపోశారు. చాలాచోట్ల ఏళ్లతరబడి తిష్ఠవేసిన ఉద్యోగులను జల్లెడపట్టి అక్కడి నుంచి కదిలేలా నిర్ణయం తీసుకున్నారు. నానాపాట్లు పడి సంపాదించిన నేతల సిఫార్సు లేఖలు చెల్లకపోవడంతో పలువురు కంగుతిన్నారు. సర్వీసులను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా బదిలీల కమిటీ నరసాపురం డివిజన్‌లోని కొందరు ఉద్యోగులను భీమవరం, తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌లకు, అక్కడి వారిని ఇక్కడకు బదిలీ చేశారు. ఈప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో తహసీల్దార్ల ఉపనియామకాలపై రెవెన్యూశాఖలో జోరుగా చర్చ నడుస్తోంది. సొంత నియోజకవర్గాలకు ఉపనియామకం ద్వారా వెళ్లడానికి ప్రయత్నిస్తున్న తహసీల్దార్లు అలా కుదరక పోతే సమీపంలోని మండలాలకు వెళ్లడానికి అనుమతులు తీసుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు పక్కాగా జరగాలి: జేసీ

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలుపై సంబంధిత ఉద్యోగులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సంయుక్త కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సాంకేతిక శిక్షణ తరగతులను తాడేపల్లిగూడెం డివిజన్ ఉద్యోగులకు భీమవరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. పౌర సరఫరాల సంస్థ డీఎం శివరామ ప్రసాద్, డీఎస్‌వో సరోజ, జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మంచి రోజులు!

● మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం ● ఉమ్మడి జిల్లాకు రూ.1.90 కోట్లు మంజూరు



భోజనం చేస్తున్న చిన్నారులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏలూరు గ్రామీణ మండలంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనమున్నా మౌలిక సదుపాయాలు లేవు. అత్యవసర పరిస్థితుల్లో కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు లేవు. చిన్నారులకు సురక్షిత తాగునీరు అందించే సౌకర్యం లేదు.

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, లబ్ధిదారులు అసౌకర్యాల నడుమ బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. ఉమ్మడి జిల్లాలోని చాలా కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితులే ఉన్నా అయిదేళ్లలో సౌకర్యాలు కల్పించాలన్న విషయాన్ని ఆ ప్రభుత్వం విస్మరించింది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు మంచిరోజులు రానున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టింది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 4,450 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వీటిలో సొంత భవనాలుండి కనీస వసతులు అవసరమైనచోట కల్పించనున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పనకు సంబంధించిన పనుల నిర్వహణ బాధ్యతను జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగానికి అప్పగించారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు, తాగునీటి కల్పనకు ఒక్కో ఆర్వో ప్లాంటుకు రూ.17 వేల చొప్పున ఖర్చు చేయనున్నారు.

701 కేంద్రాల్లో.. ఉమ్మడి జిల్లాలో సదుపాయాలు కల్పించాల్సిన కేంద్రాలు ఎన్ని ఉన్నాయో గుర్తించారు. ఆ మేరకు 701 కేంద్రాల్లో 377 మరుగుదొడ్లు, 324 తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.1.90 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కొన్ని మండలాల్లో ఎక్కువ పనులు మంజూరు చేశారు. వాటితో పాటు మిగిలిన కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనుల పర్యవేక్షణ బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్‌కు అప్పగించారు. వీలైనంత వేగంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు జిల్లా అధికారులు పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం.. పక్కా భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా చర్యలు తీసుకుంటున్నాం' అని ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ఐసీడీఎస్ పీడీలు కేపీవీఎల్ పద్మావతి, బి.సుజాతరాణి తెలిపారు.

జిల్లా	మరుగుదొడ్ల నిర్మాణ పనులు	నిధులు (రూ.లక్షల్లో)	తాగునీటి సౌకర్యం	నిధులు (రూ.లక్షల్లో)
ఏలూరు	227	81.72	186	31.62
పశ్చిమ	150	54.0	138	23.46

దారులు దయనీయం..!
ఈసురోమంటున్న సంక్షేమం
ఇప్పుడే వస్తానని అనంతలోకాలకు..!
8లో

స్వచ్ఛతాహీ సేవలో భాగస్వాములు కండి



ఆర్టీసీ బస్టాండు ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న పద్మశ్రీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సమాజంలోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ పిలుపునిచ్చారు. గురువారం ఆమె స్థానిక ఆర్టీసీ కొత్త బస్టాండు ఆవరణలో మొక్క నాటి నీరు పోశారు. రహదారులను శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడారు. డీఆర్వో పుష్పమణి మాట్లాడుతూ ఈ నెల 17న ప్రారంభమైన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు అక్టోబరు 2తో ముగుస్తాయన్నారు. జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లాకు ద్వితీయ స్థానం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ద్వితీయ స్థానం లభించిందని డీపీవో శ్రీనివాస విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలను చైతన్యపరచడం, పారిశుద్ధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఈ ఘనత లభించిందని వివరించారు.

అత్తిలిలో 23.8 మి.మీ. వర్షం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు జిల్లాలో 7.3 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అత్తిలిలో 23.8 మి.మీ. వర్షం కురిసింది. ఇరగవరంలో 18.0 మి.మీ., భీమవరం 15.2, ఉండి 13.0, పాలకోడేరు 12.4, వీరవాసరం 10.4 మిగిలిన మండలాల్లో 10 మిల్లీ మీటర్ల కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.

పాపికొండల మణిహారం.. అలరించే తీరం



నేడు పర్యాటక దినోత్సవం

ఉమ్మడి జిల్లాలో ఇలా

3.5 లక్షలు ఏటా వచ్చే పర్యాటకులు

రూ. 3 కోట్లు వార్షిక ఆదాయం

2 వేలు పర్యాటకంగా ఉపాధి పొందుతున్నవారు

ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాంతాలు


పాపికొండలు, పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల, ద్వారకాతిరుమల ఆలయం, ఎర్రకాలువ జలాశయం, గుంటుపల్లి గుహలు జీలకర్రగూడెం, గుబ్బల మంగమ్మగుడి, పారిజాతగిరి, కొల్లేరు సరస్సు, పేరుపాలెం బీచ్, పెదమల్లం రిసార్ట్స్, యలమంచిలిలంక, చించినాడ, నరసాపురం గోదావరి తీర ప్రాంతాలు.

పాలకొల్లు, పోలవరం, న్యూస్‌టుడే

ఉమ్మడి పశ్చిమలో ప్రకృతి రమణీయత ఎంత చూసినా తనివి తీరదు. పేరుపాలెం దగ్గర 9 కి.మీ. మేర విస్తరించి ఉన్న సాగర తీరం జిల్లాకు ఒక వడ్డాణమే. 60 కి.మీ. మేర వ్యాపించి ఉన్న గోదావరి అందమే వేరు. ఇంతటి ప్రత్యేకత ఉన్న జిల్లాలో కూటమి ప్రభుత్వం వచ్చాక పర్యాటక బాటలు పరచుకుంటున్నాయి.



ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో విస్తరించిన పాపికొండల అభయారణ్యంలో వన్యప్రాణుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వాటి సంరక్షణతో పాటు పాపికొండల సందర్శనకు వచ్చే పర్యాటకుల కారణంగా ఎటువంటి అవాంతరం తలెత్తకుండా పోలవరంలో వన్యప్రాణి విభాగం సబ్ డీఎఫ్‌వో కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. . వన్య ప్రాణుల సంరక్షణతో పాటు పర్యటక రంగాన్ని ప్రోత్సహించేందుకు అటవీశాఖ తరఫున పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు పోలవరం ఇన్‌ఛార్జి అటవీశాఖాధికారి ఎం.దావీద్‌రాజు తెలిపారు.





☛ ఆచంట మండలం పెదమల్లంలో 2019కు ముందు పర్యాటక అతిథి గృహాలు నిర్మించారు. వీటికి అయిదేళ్ల వైకాపా పాలనలో కనీసం రహదారి నిర్మించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధి నిధులు రూ.2 కోట్లతో రహదారి నిర్మించడానికి ప్రతిపాదనలు చేసింది. జిల్లాలో పేరుపాలెం బీచ్‌కు ఏటా ఒక్క కార్తికమాసంలోనే 2 లక్షల మంది పర్యాటకులు వస్తుంటారు. పర్యాటకంగా ఇప్పటికే కొన్ని వసతులున్నా సరిపోని నేపథ్యంలో ఆశాఖ కొత్త ప్రతిపాదనలు చేసింది. సముద్రానికి చేరువలో వంద ఎకరాలు సేకరించడానికి ప్రస్తుతం భూములు గుర్తిస్తున్నారు. ఆయా భూములను లీజుకు తీసుకుని వాటిలో జలక్రీడలు అభివృద్ధి చేయాలనేది ప్రణాళిక.

రానున్నదంతా సీజనే.. వచ్చే నవంబరులో కార్తిక మాసం నుంచి డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి వరకు ఉమ్మడి జిల్లాలో పర్యాటకశాఖ అతిథి గృహాలు ముందస్తు బుకింగ్‌లతో కిక్కిరిసిపోతాయి. ఏటా పోటెత్తుతున్న పర్యాటకులకు గోదావరి, పేరుపాలెం తీరంలో విశ్రాంత గృహాలు సరిపోవడం లేదు. దీనిపై జిల్లా పర్యాటకశాఖాధికారి ప్రభాకర్‌ను సంప్రదించగా పర్యాటక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం జిల్లాల వారీగా కసరత్తు చేస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని గోదావరి తీర ప్రాంతాల్లో బోటింగ్ పాయింట్లు పెట్టేందుకు ప్రతిపాదనలు చేశామని చెప్పారు.




ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాల, బాలికల రైఫిల్ షూటింగ్ ఎంపికలు భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ బీకేసీఎం పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు సత్తాచాటారు. డీఎస్‌డీఓ పాలకుర్తు సంయుక్త కార్యదర్శి కూనిస రాజు రామకృష్ణంరాజు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి మల్లేశ్వరరావు, గాదిరాజు వెంకటకృష్ణంరాజు, సయ్యద్ సుభాన్, ప్రధానాచార్యులు శ్రీనివాసరావు, జీఎస్ శేఖర్‌రాజు, రామకృష్ణంరాజు, బుద్ధుస్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

సాఫ్ట్ టెన్నిస్, హ్యాండ్ బాల్ ఉమ్మడి జిల్లా జట్లు..

వీరవాసరం, న్యూస్‌టుడే: పాఠశాల విద్యా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల బాలబాలికల సాఫ్ట్ టెన్నిస్, హ్యాండ్ బాల్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 28, 30వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యా సమాఖ్య జిల్లా కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న సాఫ్ట్ టెన్నిస్ ఎంపిక పోటీలను గణపవరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో, 30న హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలను ఏలూరు ఇండోర్ స్టేడియంలో (గ్రౌండ్స్) నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ప్రవేశ పత్రంతో పాటు మధ్యాహ్న భోజన పత్రాలను వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు 63052 27671, 80741 53923 నంబర్లను సంప్రదించాలన్నారు.

వరద బాధితులకు దాతల సాయం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం భీమవరంలోని కాస్మోపాలిటన్ క్లబ్ సభ్యులు రూ.10లక్షల చెక్కును ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు గురువారం అందజేశారు. ★ భీమవరం అల్లూరి సీతారామరాజు సేవాసమితి రూ.లక్ష చెక్కును అందజేసింది. దాతల సాయాన్ని ఎమ్మెల్యే రామాంజనేయులు అభినందించారు. ★ కలెక్టర్ నాగరాణికి పలువురు దాతలు కలిసి విరాళం చెక్కులు అందించారు.


రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే రామాంజనేయులుకు అందిస్తున్న కాస్మోపాలిటన్ క్లబ్ ప్రతినిధులు

ప్రజాకాంక్షలు నెరవేరుస్తున్నాం: మంత్రి

పాలకొల్లు, న్యూస్‌టుడే: పేద, మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలను దశల వారీగా నెరవేరుస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. యలమంచిలి మండలం కొంతేరులో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' సభ నిర్వహించారు. మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... రాష్ట్రాన్ని ఎల్లోగిరా చిక్కుల్లో పడేయాలన్న దురాలోచనతో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని మండిపడ్డారు. విజయవాడను వరదలు చుట్టుముట్టి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ప్రకాశం బ్యారేజీని ధ్వంసం చేసేందుకు వైకాపా కుట్ర చేసిందని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ఎన్డీయే ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలని ఆయన పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం: ఏఎస్పీ

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై మహిళలు, యువతులు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం అదనపు ఎస్పీ ఎన్.బి.ఎం. మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో చోటుచేసుకుంటున్న నేరాలను బాలికలు పోలీసుల దృష్టికి తేవడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. ఎక్కడ ఏ నేరాలు జరిగినా 112కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ర్యాగింగ్, పోక్సో చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పట్టణ సీఐ కె. రజనికుమార్, కళాశాల ప్రనాదాచార్యురాలు టి.రాజరాజేశ్వరి, జి.ప్రమీళ దేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దారులు దయనీయం..!


కొణికిలో ఇలా..


కొణికి-కుదరవల్లి వంతెనపై శిథిలమైన నడకదారి

పెదపాడు మండలంలో రహదారులు, వంతెనలు దయనీయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గోతులేర్పడి రాళ్లు తేలాయి. వంతెనలు కుంగిపోయి నెర్రలిచ్చాయి. వంతెనలపై నడకదారుల్లో సిమెంట్ పలకలు ఛిద్రమయ్యాయి. వీటిపై వెళ్లేందుకు వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. వైకాపా అయిదేళ్ల పాలనలో వీటికి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి రహదారులు, వంతెనలకు మరమ్మతులు చేపట్టాలని వారంతా కోరుతున్నారు. **- ఈనాడు, పెదపాడు**


వట్లూరు నుంచి పెదపాడు వెళ్లే మార్గంలో శిథిలమై నెర్రలిచ్చిన వంతెన

మేము సైతం..!

కలిదిండి, కైకలూరు, న్యూస్‌టుడే

ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడట్లేదు. ప్రభుత్వమే దిగి రావాలి.. అధికారులే చేయాలని ఆశించట్లేదు. 'మేము సైతం..' అంటూ ప్రజలే స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. కష్టపడి సంపాదించిన దానిలో కొంత సమాజానికి ఖర్చు పెట్టాలని భావిస్తున్నారు. ఒకే మాటతో.. చేయి చేయి కలిపి గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. సమస్యల పరిష్కారంలో చేదోడుగా నిలుస్తున్నారు. కైకలూరు నియోజకవర్గ ప్రజల స్ఫూర్తికి జిల్లా వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

- అభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం
- స్ఫూర్తినిస్తోన్న కైకలూరు నియోజకవర్గ వాసులు

మూడు గ్రామాల ప్రజలు కలిసి..

కొల్లేరు లంక గ్రామాల ప్రజలు స్ఫూర్తిదాయకంగా నడుచుకుంటున్నారు. వరద సమయాల్లో గండ్లు పడి గ్రామాలు మునిగిపోతున్న సమయంలో స్వయంగా ఆ గండ్లు పూడ్చివేతకు ముందుకొస్తున్నారు. గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేసుకోవడానికి పూనుకున్నారు. సర్కారు కాలువ - పందిరిపల్లిగూడెం, పైడిచింతపాడు - గోకర్ణపురం రోడ్లకు తాత్కాలిక మరమ్మతుల నిమిత్తం పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు గ్రామాల ప్రజలు ఒక్కో కుటుంబం నుంచి రూ.300 చొప్పున రూ.24 లక్షల విరాళాలు సేకరించారు.



కాలువల ప్రక్షాళనకు సన్నద్ధం

కొల్లేరుకు సముద్రానికి అనుసంధానంగా ఉన్న ఉప్పుటేరుతోపాటు నియోజకవర్గంలోని ప్రధాన కాలువల ప్రక్షాళనకు రైతులు ముందడుగు వేశారు. పూడిక తీత, కిక్కిస, గుర్రపు డెక్క తొలగింపు, గట్లు బలోపేతం చేయడానికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ నేతృత్వంలో నిర్ణయించుకున్నారు. రూ.45 లక్షల వ్యయంతో రెండు పంట్లు సొంతంగా తయారు చేయించనున్నారు. ఆ తర్వాత నిర్వహణ ఖర్చులనూ భరించడానికి సిద్ధంగా ఉన్నారు. దీనిని నిమిత్తం ఎకరాకు రూ.200 నుంచి రూ.500 వరకు విరాళాలు ఇస్తామంటూ ప్రకటించారు.



రైతుల పెద్ద మనసు

కలిదిండి మండలంలోని గుర్వాయిపాలెం - భాస్కరరావుపేట రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ మార్గంలో ఆరు గ్రామాలున్నాయి. గుంతల్లో పడి వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల రైతులు స్వచ్ఛందంగా మరమ్మతులకు ముందుకొచ్చారు. రూ.10 లక్షల విరాళాలు వేసుకుని.. స్వయంగా దగ్గరుండి పెద్ద పెద్ద గుంతలు పూడ్చించారు.

చిత్రలేఖన పోటీల విజేతలు వీరే


ప్రథమ స్థానం పొందిన చిత్రం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీ విజేతల వివరాలను ఆ సంస్థ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన విజేతలకు అక్టోబరు 1న భీమవరంలోని క్విట్ ఇండియా స్తూపం వద్ద, ఏలూరు జిల్లా విజేతలకు అక్టోబరు 2న పెదనిండ్రకొలను గాంధీ భవనంలో, తూర్పుగోదావరి జిల్లా విజేతలకు అదేరోజు మల్లవరంలోని గాంధీ ఆశ్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రశంస పత్రాలను పంపిస్తామని తెలియజేశారు.

సబ్ జూనియర్స్ విభాగంలో.. ప్రథమ: పి.మోక్షిత- దర్భగూడెం, ద్వితీయ: సాయి స్వాగత్- నందమూరుగరువు, తృతీయ: కె.గంగ హోమిని- దండగర్ర.


జూనియర్స్ విభాగంలో.. ప్రథమ: సీహెచ్ భావిశ్- వేలివెన్ను, ద్వితీయ: టి.భార్గవ్- ఏలూరు, తృతీయ: గాయత్రి- శనివారపుపేట.

సీనియర్స్ విభాగంలో.. ప్రథమ: టెఫిని- భీమవరం, ద్వితీయ- ఎ.శ్రీవర్షిణి- మేడపాడు, తృతీయ- ఎస్.ప్రజ్ఞ తపస్వి- నిడదవోలు.

కళాశాలల స్థాయిలో. ప్రథమ: శ్యామలగౌరి- భీమవరం, ద్వితీయ: నిహారిక- ఏలూరు, తృతీయ: కె.హర్ష- బుట్టాయగూడెం.

అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా

ఈనాడు కథనానికి స్పందన



భీమవరం వన్ టౌన్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలకు ఎట్టకేలకు కందిపప్పు చేరింది. జిల్లాలో నాలుగు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఏమి వండి పెట్టాలో తెలియక నిర్వాహకులు తలలు పట్టుకున్నారు. కందిపప్పు సరఫరాపై ఈనెల 16న 'పప్పు లేకుండా.. వండి పెట్టేదెలా..' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా వ్యాప్తంగా కందిపప్పు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా ఉన్న 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 64 సెక్టార్లకు 20,640 కిలోల ప్యాకెట్ల కంది పప్పు సరఫరా చేసినట్లు ఐసీడీఎస్ పీడీ పి.సుజాత రాణి తెలిపారు.

విద్యార్థి ఆచూకీ కనుగొనండి: ఎంపీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: మారేడుమిల్లి అటవీ ప్రాంతంలోని జల తరంగిణి వాగులో కొద్ది రోజుల కిందట కొట్టుకుపోయిన వైద్య విద్యార్థి ఆచూకీ కనుగొనాలని ఎంపీ మహేశ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వాగులో కొట్టుకు పోయిన ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరి మృతదేహాలు లభించగా.. హరదీప్ ఆచూకీ ఇంతవరకూ కనుగొనలేకపోయారని అతని తల్లిదండ్రులు గురువారం ఎంపీ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ హరదీప్ ఆచూకీ కనుగొనేందుకు అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని ఎస్పీని కోరారు.

రంగంలోకి డాగ్‌స్క్వాడ్.. కొనసాగుతున్న గాలింపు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి జలపాతంలో గల్లంతైన వైద్య విద్యార్థి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయినా ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. గాలింపు చర్యలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఏఎస్పీ జగదీశ్ అడహళ్లి, జిల్లా అటవీశాఖ అధికారిణి బబిత గురువారం స్వయంగా పర్యవేక్షించారు. గత ఆదివారం ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు గల్లంతైన విషయం తెలిసిందే. వారిలో సీహెచ్ హరదీప్ (20) ఆచూకీ ఇప్పటికీ లభించని విషయం తెలిసిందే. అయిదు రోజులుగా పోలీసు, రెవెన్యూ, అటవీశాఖ బృందాలతోపాటు, కేంద్ర, రాష్ట్ర విపత్తుల బృందాలు (ఎన్డీఆర్ఎఫ్) నిర్విరామంగా గాలిస్తున్నాయి. ఇందుకోసం డ్రోన్లు కూడా వినియోగిస్తున్నారు. గురువారం నుంచి డాగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యార్థి ఆచూకీ కనిపెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు. మన్యంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో సదరు విద్యార్థి ప్రవాహంలో కొట్టుకుని పోయి, పాములేరు మీదుగా గోదావరిలోకి వెళ్లిపోయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చూర పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం వేలం కేంద్రంలో చూర పొగాకు కొనుగోళ్లు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు కేజీ రూ.245 అత్యధిక ధర లభించింది. త్వరలోనే కొనుగోళ్లు పూర్తి చేస్తామని వేలం నిర్వహణాధికారిణి గ్రేస్ మార్గరేట్ తెలిపారు.

ఇంజినీరింగ్ సహాయకుడి సస్పెన్షన్

భీమవరం కలెక్టరేట్, నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం మండలం దర్భరేవు ఇంజినీరింగ్ సహాయకుడు కొల్లాటి లీలాకృష్ణను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ నాగరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్లకు చెల్లింపులు జరిగాయని ఆ గ్రామస్థుల నుంచి ఫిర్యాదు వచ్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. విచారణలో ఆరోపణలు వాస్తవమని నివేదిక అందడంతో ఆ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

18 గ్రాముల బంగారు నక్లెస్ చోరీ

పెనుగొండ, న్యూస్‌టుడే: వెంకట్రామపురం శివారు మల్లప్పదిబ్బలో నివాసముంటున్న కూచిపూడి దుర్గ ఇంట్లో సుమారు 18 గ్రాముల బంగారు నక్లెస్ చోరీకి గురైందని ఎస్సై కొప్పిశెట్టి గంగాధర్ తెలిపారు. బాధిత మహిళ ఇంటి వద్దే కిరాణా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తోంది. ఈమె కుమార్తెతో కలిసి గురువారం ఓ వేడుకకు వెళ్లారు. తిరిగి ఇంటికొచ్చి చూడగా- బీరువాలో నక్లెస్ కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఈసురోమంటున్న సంక్షేమం

అద్దె భవనాలు... అరకొర సౌకర్యాలతో వెతలు

ఈనాడు డిజిటల్, భీమవరం, తాడేపల్లిగూడెం అర్బన్, వీరవాసరం, తణుకు గ్రామీణం:

పేద, మధ్య తరగతి విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు ఏర్పాటుచేసిన వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారుతున్నాయి. అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, మెనూ ప్రకారం భోజనం లేదని, కాస్మొటిక్ ఛార్జీలు విడుదల కాలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలోని బీసీ వసతిగృహాలు **29** | విద్యార్థులు **1,910**

తాడేపల్లిగూడెం, యాగర్లపల్లిలో బీసీ వసతిగృహ భవనాలు శిథిలమవడంతో గతేడాది గొల్లగూడెం కూడలిలోని ఓ ప్రైవేట్ భవనంలోకి తరలించారు. ఇక్కడ 52 మంది విద్యార్థులుండగా నాలుగే మరుగుదొడ్లు ఉన్నాయి. 15 మంది చాలీచాలని ఆరు గదుల్లో సర్దుకోవాల్సి వస్తోంది. మరుగుదొడ్లు, గదులను క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని విద్యార్థులు వాపోతున్నారు.


యాగర్లపల్లి బాలికల వసతి గృహంలో రంగుమారిన మంచినీరు

వీరవాసరం బీసీ బాలుర పాఠశాల వసతి గృహంలో 45 మంది విద్యార్థులున్నారు. నాలుగు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. పడకలు (మంచాలు) లేక కిందే పడుకుంటున్నారు. మెనూ అమలు కాక, ఆహారంలో నాణ్యత లేకపోవడంతో విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. ఇటీవలే కొంతమంది జ్వరం బారినపడ్డారు.



తణుకులో బీసీ బాలిక పాఠశాల, కళాశాల వసతి గృహాలు రెండూ ఒకేచోట నిర్వహిస్తున్నారు. 70 మంది విద్యార్థులున్నారు. పైకప్పు పెచ్చులూడటంతో వర్షపు నీరు కారుతోంది. గోడలు చెమ్మగిల్లి చలికి వణికిపోతున్నారు. వంట గదిలో పందికొక్కులు నెలను తవ్వేస్తుండటంతో పరిసరాలు అధ్వానంగా మారాయి.


తణుకు బీసీ బాలికల వసతిగృహంలో పైకప్పు పెచ్చులూడి చెమ్మగిల్లుతున్న గోడలు

నాణ్యత లేని ఆహారం

★ విద్యార్థుల్లో పౌష్టికాహారం లోపాన్ని అధిగమించడానికి రూపొందించిన ప్రత్యేక మెనూ అమలు చేయడం లేదు. గతంలో భీమవరంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహానికి చెందిన 11 మంది విద్యార్థులు గతంలో అస్వస్థతకు గురయ్యారు.

★ తాడేపల్లిగూడెంలోని గతనెలలో ఓ వసతిగృహ విద్యార్థిని పౌష్టికాహార లోపంతో అస్వస్థతకు గురైంది. ఇలాంటి పరిస్థితులు జిల్లాలో ఎక్కడొక చోట జరుగుతూనే ఉన్నాయి. వసతిగృహంలో ఉంటున్న ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.1600 చెల్లిస్తుండగా, ఇది సరిపోవడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు.

★ భీమవరంలోని బీసీ బాలురు, బాలికల కళాశాల వసతిగృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీరవాసరంలో సొంత భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా స్థలం లేక అద్దె భవనాల్లో కొనసాగుతోంది.

★ పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 29 బీసీ వసతి గృహాలున్నాయి. ఇక్కడ 1910 మంది విద్యార్థులుండగా, కాస్మొటిక్, డైట్ ఛార్జీలు సుమారు రూ.87 లక్షల వరకు పెండింగ్ ఉన్నాయి.

చెరువులో పడి యువకుడి మృతి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చెరువులో పడి యువకుడు మృతిచెందిన ఘటన చింతలపూడి మండలం రేచర్లలో చోటుచేసుకుంది. ఎస్సై కుటుంబరావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏలూరు నాగరాజు(26) తాపీ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం పనికి వెళ్లి తిరిగి ఇంటికొచ్చాక సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. అనంతరం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా.. ఆచూకీ తెలియలేదు. గురువారం ఉదయం పశువుల కాపరులు చెరువులో మృతదేహాన్ని గుర్తించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. శవాన్ని వెలికితీసి చూడగా నాగరాజుగా గుర్తించారు. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యార్థిని అదృశ్యం

కాలువలో దూకినట్లు అనుమానం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : తొమ్మిదో తరగతి విద్యార్థిని అదృశ్యమైన ఘటన తణుకు మండలం కోనాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కోనాల గ్రామానికి చెందిన విద్యార్థిని ముద్దాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. గురువారం బ్యాగు తరగతి గదిలో ఉంచి బయటకు వెళ్లిపోయింది. అనుమానం వచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థిని కోసం గాలించారు. ముద్దాపురం నుంచి దువ్వ వెళ్లే రహదారిలో మూలలంక వయ్యేరు వంతెన వద్ద ఆమె చెప్పులు ఉండటంతో కాలువలో దూకినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కాలువలో గాలింపు చేపట్టారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామీణ ఎస్సై జీఎస్‌వి మూర్తి అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ★ విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు మందలించడం వల్లే మనస్తాపం చెంది కాలువలో దూకి ఉంటుందని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు.


బాలిక ఆచూకీ కోసం గ్రామస్థుల నిరీక్షణ

ఇప్పుడే వస్తానని అనంతలోకాలకు..!

- నిండు ప్రాణాన్ని హరించిన నిద్ర మత్తు
- తాడేపల్లిగూడెంలో కారు బీభత్సం
- ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు


దుర్గారావు (పాత చిత్రం)


ప్రమాదానికి కారణమైన కారు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఇప్పుడే వస్తానని బయటకు వెళ్లిన ఇంటి పెద్ద దిక్కు కారు ప్రమాదంలో విగత జీవిగా మారారు. తాడేపల్లిగూడెం పట్టణంలో కారు బుధవారం అర్ధరాత్రి బీభత్సం సృష్టించింది. రోడ్డుపై నడుస్తున్న ముగ్గురిని ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. నిడమర్రు మండలం బువ్వనపల్లికి చెందిన వినయ్ బాబు కారు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని బుధవారం రాత్రి కారులో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో దించి ఇంటికి తిరుగుపయణమయ్యారు. రెండో పట్టణానికి చెందిన కరణం దుర్గారావు (30), యడ్ల నాగేశ్వరరావు, మజ్జి దుర్గాప్రసాద్ పోలీస్ ఐలాండ్ నుంచి రేలంగి చిత్రమందిరం వైపు నడుచుకుంటూ వెళ్తున్నారు. నిద్రమత్తులో కారు నడుపుతున్న వినయ్‌బాబు వీరిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దుర్గారావు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వారిని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. వీరిలో యడ్ల నాగేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమండ్రిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబం

మృతుడు దుర్గారావు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈయనకు భార్య ఇద్దరు మగ సంతానం ఉన్నారు. ఇప్పుడే వస్తానని ఇంటి నుంచి బయటకొచ్చిన దుర్గారావు కారు ప్రమాదంలో తిరిగిరాని లోకానికి వెళ్లడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరైంది. ఇంటి పెద్దను కోల్పోవడంతో ఇద్దరు చిన్నారులు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 రిటైల్ ధర స్కిన్ - 250 విత్ స్కిన్‌లెస్ - 260.

భీమవరం

• భీమవరం • ఉండి

వేంకన్న సన్నిధిలో యాగశాలార్చన, అగ్నిప్రతిష్ఠ పూజలు



కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల మండలం కాళ్లకూరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో సప్త నదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్స వాల్లో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం యాగశాల ప్రవేశం, అర్చన, అగ్ని ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. సాయంత్రం యాగశాలార్చన, హోమాలు, పవిత్ర ప్రతిష్ఠ పూజలు, స్వామివారి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ పూజలు ప్రధానార్చకుడు కాండూరి వెంకట రమణాచార్యులు పర్యవేక్షణలో నిర్వహించినట్లు ఆలయ ఈవో ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు.



నేత్రపర్వంగా గంగానమ్మ జాతర

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: జాలర్ల ఐదెళ్ల గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం రెస్ట్ హౌస్ రోడ్డులోని జాలర్ల సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి జాతర సందర్భంగా ఉదయం అమ్మవారి ఆలయంలో విశేషాభిషేకాలు, సహస్ర నామ కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం జాలర్ల వీధుల నుంచి మేళతాళాలు, ఆసాదులు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారులతో మహిళలు, చిన్నారులు జాతరలో పాల్గొన్నట్లుగా ఉన్న ప్రతిమలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో అమ్మవారి ప్రతిమతో బాణసంచా కాల్పుల మధ్య జాతర ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవున్న భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలు చెల్లించారు. జాలర్ల సంఘం ప్రతినిధుల పర్యవేక్షణలో జరిగిన ఊరేగింపు రాత్రికి ఆలయానికి చేరుకుంది.

విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులు సమస్య పరిష్కారం కోసం శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు భీమవరంలోని ఆ శాఖ ఈఈ కార్యాలయంలో వేదిక నిర్వహించనున్నట్లు ఆ శాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

పాలకోడేరు, న్యూస్‌టుడే: భీమవరం డివిజనల్ కార్యాలయం వద్ద శుక్రవారం విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాలకోడేరు ఏఈ అప్పారావు తెలిపారు.

తహసీల్దార్‌గా సుందర్ సింగ్ బాధ్యతలు

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల మండలం తహసీల్దార్‌గా గొల్లమందుల సుందరసింగ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా ఉన్న నాగార్జున ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

దుప్పట్ల పంపిణీ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వాసవి క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా భీమవరంలోని బీసీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు దుప్పట్లు అందజేశారు. వాసవి క్లబ్ భీమవరం అధ్యక్షుడు పూసారపు ఎన్.వి.వి.సత్యనారాయణ గుప్తా, కార్యదర్శి ఆర్.వెంకట శ్రీనివాసు,కె.రవికుమార్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి

కాళ్ల, న్యూస్‌టుడే: రైతులు ముఖ్యంగా వరిలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని జిల్లా వనరుల కేంద్రం ఏవో జి.బాలనాగేశ్వరమ్మ అన్నారు. గురువారం కోపల్లె గ్రామంలో వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంపొందించుకోవాలని పశువుల ఎరువు, నత్రజని ఎరువుని పెంపొందించే అజో బ్యాక్టీరియా అజోస్పైరిల్లం వంటి జీవన ఎరువులను కూడా వేయాలని సూచించారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావు రైతులకు సూచనలు ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి జయవాసుకి, సర్పంచి బూడి నాగమణి, ఉప సర్పంచి బూడి పద్రాలు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఏటా ముంపులో పొలాలు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎర్ర కాలువ పరిధిలో ఏటా ముంపు ఏర్పడి వేల ఎకరాల్లో నష్టం జరుగుతుందని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణిని ఆయన గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గం అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

చేతనకు కలెక్టర్ అభినందన

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: చిన్న వయసులోనే భగవద్గీత పారాయణం చేయడంలో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో స్థానం సాధించడం ఎంతో గొప్ప విషయమని కలెక్టర్ నాగరాణి పేర్కొన్నారు. ఆ ఘనత సాధించిన బొలిశెట్టి చేతన గురువారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. 8 ఏళ్ల 2 నెలల వయసులోనే రికార్డు సాధించడం సామాన్యమైన విషయం కాదన్నారు.

కలిసికట్టుగా అభివృద్ధికి పెద్దపీట



మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణమోహన్

ఆకివీడు, న్యూస్‌టుడే: ప్రభుత్వం పక్కా ప్రణాళికతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు. గురువారం ఆకివీడులోని 4, 5 వార్డు సచివాలయాల పరిధిలో 'స్వర్ణాంధ్ర - 2047' 'మీ విజన్- మా మిషన్- కలిసికట్టుగా ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మిద్దాం' అనే కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రజలు కలసికట్టుగా సహాయ సహకారాలతో ఆకివీడు పట్టణాన్ని తద్వారా మన నియోజకవర్గ అభివృద్ధికి, అన్ని రంగాల ఉన్నతికి కృషి చేయాలని కమిషనర్ వివరించారు. తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సా..గదీత పనులు

పట్టణ ప్రజలకు తప్పని నీటి ఇక్కట్లు

మొదటి విడతగా విడుదలైన నిధులు ఇవీ

● అమృత్ తొలి విడతలో విడుదలైన నిధులు: రూ.47 కోట్లు ● హెడ్ వాటర్ వర్క్స్ నుంచి బుధవారం మార్కెట్ వరకు ప్రధాన పైపులైను ఏర్పాటుకు: రూ.8 కోట్లు ● పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో పైపులైన్ల ఏర్పాటుకు: రూ.20 కోట్లుబ ● ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటుకు: రూ.7 కోట్లు

రెండో విడతలో..

ఒకటోపట్టణ పరిధి నర్సయ్య అగ్రహారం, రెండో పట్టణ పరిధి దుర్గాపురం, రామలక్ష్మణ్ నగర్‌లో ఒక్కొక్కటి చొప్పున మంచినీటి సర్వీసు రిజర్వాయర్ల నిర్మాణం, తాడేరు రోడ్డులోని 82 ఎకరాల పరిధిలో రెండెకరాల విస్తీర్ణంలో మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మాణం, పైపుల చెరువు సమీపంలో 17 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మంచినీటి శుద్ధి ప్లాంటు నిర్మాణం పనులు చేపట్టారు. తాగునీటి సరఫరాకు రెండో విడతలో రూ.36.54కోట్లు కేటాయించారు. నీటిశుద్ధి ప్లాంటు రూ.15.7కోట్లు ఇచ్చారు.

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో తాగునీటి ఇబ్బందులు వెంటాడుతుంటాయి. శివారు కాలనీలు మంచినీటి ట్యాంకర్లపై ఆధారపడ్డాయి. ఉండి రోడ్డు, నర్సయ్య అగ్రహారం, దుర్గాపురం, లంకపేట, ప్రకాశ్‌నగర్, మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీ, బలుసుమూడి ఇలా దాదాపు 15 ప్రాంతాల్లో ఇబ్బందులున్నాయి. ఉండి రోడ్డు, దుర్గాపురం తదితర చోట్లకు మంచినీటి ట్యాంకరు వచ్చే సమయానికి బిందెలతో ఎదురు చూస్తారు.




భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

అమృత్(అటల్ మిషన్ ఫర్ రిజునువేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్)ను ఏడున్నరేళ్ల క్రితం భీమవరంలో పనులు ప్రారంభించారు. 1965 ప్రాంతంలో ఏర్పాటు చేసిన మంచినీటి పైపులను తొలగించి వాటి స్థానే కొత్తవాటిని ఏర్పాటు చేయడంతో పాటు ఇంటింటా కుళాయిలను అమర్చాలి. ఇప్పటి వరకు ఆ పనులు పూర్తికాలేదు. పైపులైన్లను అమర్చేందుకు తవ్విన చోట మరమ్మతులు లేక సిమెంటు రహదారులు గుంతలతో ఉన్నాయి. పలు కాలనీలకు కొత్త పైపులైన్లు ఇచ్చామని అధికారులు చెప్పినా పాత గొట్టాలే దిక్కయ్యాయి.



భీమవరంలో అమృత్ పైపులు అమర్చారు. ఇంటికి కుళాయి నీళ్లిస్తామన్న హామీ గత అయిదేళ్లలో అమలు కాలేదు. కుళాయికి అమర్చాల్సిన పైపులు రైతుబజారు ప్రాంతంలో స్తంభాలకు కట్టి ఉన్నాయి.



బీసీ కాలనీలో నిర్మించిన మంచినీటి సర్వీసు రిజర్వాయరు ఇది. స్థానికులకు నీరు అందించే పరిస్థితిలో లేదు. సాధారణ ఎన్నికలకు ముందు ఇంటింటా కుళాయిలు అంటూ హడావుడి చేసినా తర్వాత పట్టించుకోలేదు.

నత్తతో పోటీపడుతూ..

దుర్గాపురం, నర్సయ్య అగ్రహారంలో మంచినీటి సర్వీసు రిజర్వాయర్లు వినియోగంలోకి వచ్చాయని అధికారులు చెబుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికీ మంచినీటి ట్యాంకర్లు వెళ్తున్నాయి. బీసీ కాలనీలో నిర్మించిన మంచినీటి సేవా జలాశయం మాత్రం ఇంకా వినియోగంలోకి రాలేదు. కొత్తగా ఏర్పాటు చేసిన అమృత్ గొట్టాల నుంచి నీళ్లొచ్చేస్తున్నాయంటూ అధికారికంగా ప్రకటించినా నీరు రావడంలేదు. ★ ప్రస్తుతం గునుపూడిలో అమృత్ పథకం ఇంటింటా కుళాయి నీటి ట్రయల్ రన్ నిర్వహించాం. త్వరలో బ్యాంకు కాలనీలో చేపడతాం. బీసీ కాలనీలోని మంచినీటి సర్వీసు జలాశయం వినియోగంలోకి తీసుకొస్తాం. ఇంటింటా కుళాయి గొట్టాలను వెంటనే అమర్చాలని సంబంధిత గుత్తేదారుకు సూచిస్తాం. - అప్పలరాజు, డీఈ

దాతృత్వంలో పశ్చిమది ప్రత్యేకం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పలువురు కలెక్టర్ నాగరాణిని కలిసి గురువారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇతరులకు సహాయం చేయడంతో దాతృత్వాన్ని చూపడంలో పశ్చిమగోదావరి ఎప్పుడూ ప్రత్యేకత చాటుకుంటూనే ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాళ్ల సచివాలయం తరపున రూ.26,350 చెక్కు అందించిన డీఎల్‌డీవో అప్పారావు, రూ.26 వేల చెక్కును ఇచ్చిన భవిత కేంద్రాల ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు.



కలెక్టర్ నాగరాణికి రూ.71,117 చెక్కును అందజేసిన జిల్లాలోని వివిధ పాఠశాలల ప్రతినిధులు, రూ.50వేల చెక్కును ఇస్తున్న ఎక్స్ సర్వీస్‌మెన్ సంఘం నాయకులు

అవగాహన సదస్సులు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: మన ఇల్లు మన గౌరవం పేరిట గృహనిర్మాణ లబ్ధిదారులకు శనివారం అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఆ శాఖాధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో లబ్ధిదారులు కచ్చితంగా పాల్గొనాలని కోరారు.

చంద్రబాబును కలిసిన రామరాజు



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు

ఉండి,న్యూస్‌టుడే: అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని గురువారం కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపానని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) ఛైర్మన్, తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు తెలిపారు. తన సోదరుడు పెద నరసింహరాజుతో కలిసి చంద్రబాబును కలిశామని వివరించారు. తనకు కేటాయించిన పదవికి వన్నె తెచ్చే విధంగా, అధినేత ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని రామరాజు తెలిపారు.

జిల్లాకు నేడు రాక.. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) ఛైర్మన్‌గా నియమితులైన తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు దుంపగడప పరిధిలోని ఉప్పుటేరు వంతెనకు చేరుకుంటారని రామరాజు కార్యాలయ వర్గాలు తెలిపాయి. అక్కడ నుంచి ఆకివీడు, అయి భీమవరం, చెరుకుమిల్లి, జువ్వలపాలెం, కాళ్ల కూరు చేరుకొని అక్కడ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారని వివరించాయి. ఆ తర్వాత దొడ్డనపూడి, కాళ్ల, సీసలి, జక్కరం, పెద అమిరం మీదుగా భీమవరంలోని క్యాంపు ఆఫీసుకు చేరుకుంటారని తెలిపారు.



విద్యార్థుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ

పాలకోడేరు, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం పెన్నాడలోని బైట్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత గురించి విద్యార్థులు స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కొప్పర్తి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం నిరసన



వినతిపత్రం అందిస్తున్న సీపీఎం శ్రేణులు

గూట్లపాడు(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం గూట్లపాడు ప్రజలకి శుద్ధి చేసిన తాగునీటి అందించాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్, మాజీ కన్వీనర్ రేవు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో గ్రామంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కొన్నేళ్లుగా ఫిల్టర్ చేయకుండా నేరుగా కాలువ నీటిని సరఫరా చేయడం దారుణమన్నారు. ఆ అంశంపై పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు.

రామకృష్ణారావుకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

ఆకివీడు, న్యూస్‌టుడే: ప్రతికా రంగంలో సుదీర్ఘ కాలం పనిచేసి.. కొల్లేరు తీర మండలాల పరిధిలో ఎనలేని సేవలందించి.. అందరి మన్ననలు పొందిన వ్యక్తి సీనియర్ పాత్రికేయుడు కిమిడి రామకృష్ణారావు అని పలువురు ప్రజాప్రతినిధులు, తెదేపా, జనసేన, భాజపా, వైకాపా, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం ఆకివీడులో నిర్వహించిన సంతాప సభలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. తొలుత రామకృష్ణారావు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆకివీడుకు చెందిన ఈయన 1962 నుంచి ప్రముఖ దినపత్రికల్లో పనిచేశారు. సంతాప సభలో తెదేపా మండల అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, వానపల్లి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాల పేరిట రాష్ట్రాన్ని మరో 20ఏళ్ల పాటు కోలుకోలేని విధంగా వైకాపా ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసిందని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని భీమవరంలోని గునుపూడిలో గురువారం నిర్వహించారు. ఆర్థిక భారాన్ని, ప్రకృతి విపత్తులను అధిగమిస్తూనే 100 రోజుల పాలనలో సంక్షేమం, అభివృద్ధిని కూటమి ప్రభుత్వం రుజువు చేసిందన్నారు. రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. రైతన్నల ఇబ్బందులు తెలిసిన ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.వేలకోట్లు ధాన్యం బకాయిలను విడుదల చేసిందన్నారు. భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో రక్తశుద్ధి కేంద్రం పనులు చేపట్టామన్నారు. పిల్లలను చదివించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తెదేపా, జనసేన నాయకులు తోట సీతారామ లక్ష్మి, మెంటే పార్థసారథి, కోళ్ల నాగేశ్వరరావు, మెరగాని నారాయణమ్మ, ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, షబీనా, వీర మహిళలు హాజరయ్యారు. గునుపూడిలోని సోమేశ్వరాలయం నుంచి దాదాపు కిలో మీటరు పొడవునా బాణసంచా కాల్చుతూ ప్రభుత్వ 100 రోజుల వేడుకను అభిమానులు నిర్వహించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రామాంజనేయులు, నాయకులు



కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, తదితరులు

పెదఅమిరం (కాళ్ల), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తోందని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం పెద అమిరం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వర్ణాంధ్రా@ 2047లో భాగంగా ప్రతి ఒక్కరూ తమ సలహాలు మంచి సూచనలు అందించే విధంగా ఒక పోర్టల్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలు ప్రదర్శించారు. నియోజకవర్గంలో ప్రజలు సూచించిన సలహాలనే పాటిస్తున్నానన్నారు. 2029 నాటికి భీమవరాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి పెద అమిరం తరపున రూ.2 లక్షల చెక్కును సర్పంచి డొక్కు సోమేశ్వరరావు ఎమ్మెల్యేకు అందించారు. భాజపా ఉండి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోరా రామ్మూర్తి, ఉప సర్పంచి జవ్వాది లీలా కిశోర్, తెదేపా ఇన్‌ఛార్జి జీవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్

ఇళ్లు తొలగించేందుకు గడువు ఇవ్వండి

అయిభీమవరం (ఆకివీడు), న్యూస్‌టుడే: అయి భీమవరం గ్రామ పరిధిలో వెంకయ్య వయ్యేరు కాలువ గట్టు వెంబడి నివాసాల తొలగింపునకు ఆరు నెలలు గడువు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ తెలిపారు. గురువారం అయి భీమవరం గ్రామ పరిధిలో సీపీఎం నాయకులు పర్యటించారు. ఈ ప్రాంత వాసులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. స్థలాలు లేనివారికి స్థలాలను వెంటనే మంజూరు చేయించాలన్నారు. కార్యక్రమంలో కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, దోకల లక్ష్మి, బొడ్డుపల్లి రాంబాబు తదితర నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

తెలుగుతల్లి కంఠాభరణం ఘంటసాల

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: తెలుగుతల్లి కంఠాభరణం ఘంటసాల వెంకటేశ్వరరావు అని వక్తలు కొనియాడారు. గురువారం రాత్రి రవీంద్రభారతిలో ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో డా.అక్కినేని నాగేశ్వరరావు పురస్కారాల ప్రదానోత్సవం కనులపండువగా నిర్వహించారు. అకాడమీ అధ్యక్షుడు పొణకల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సంపూర్ణ తూర్పుకాశీ క్షేత్రం వరసిద్ధి వరప్రసాద్ గురూజీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాకతీయ వర్సిటీ విశ్రాంత ప్రొ. తిరుపతయ్య, గాయకుడు ప్రభాకర్ (భద్రాద్రి), శంకర్ ప్రసాద్ (ముంబయి), న్యాయవాది రంగనాథ్, గాయకుడు వై.వి.రమణ (భీమవరం), లీగల్ అడ్వయిజర్ నాగరఘులకు పురస్కారాలు ప్రదానం చేశారు.

గత సమస్యలన్నీ పరిష్కరించాలి



బాబ్జీని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం భీమవరంలో గురువారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు గాతల జేమ్స్ మాట్లాడుతూ గతంలోని వేతన సవరణ, కరవు భత్యం బకాయిలు, అపరిష్కృతంగా ఉన్న గత బకాయిలను ఒకేసారి విడుదల చేయాలని కోరారు. పీఆర్సీ కమిటీ నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. అనంతరం ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజరు బి.బాబ్జీ హాజరై పింఛనర్లకు బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. బ్యాంకర్ల సేవలు అభినందనీయమంటూ ఆయనను విశ్రాంత ఉద్యోగులు సన్మానించారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగిరాజు నారాయణరాజు, కోశాధికారి బి.వి రవిప్రసాద్, వివిధ మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై దృష్టి సారించాలి



చిన అమిరంలో మందు తయారు చేస్తున్న రైతులు

చినఅమిరం, కొవ్వాడఅన్నవరం(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: ఎలుకల వల్ల వరి పంటకు ఎక్కువ నష్టం జరుగుతోందని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం చినఅమిరం, కొవ్వాడ అన్నవరం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తయారు చేసిన మందును రైతులకు పంపిణీ చేశారు.

ఉండిలో నివారణ మందు పంపిణీ.. ఉండి, న్యూస్‌టుడే: ఉండిలో గురువారం ఎలుకల మందు రైతులకు పంపిణీ చేశారు. ఏవో బి.సంధ్య మాట్లాడుతూ సామూహికంగా ఎలుకలను నిర్మూలించేందుకు సాగుదారులంతా కృషి చేయాలని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

ఆడపిల్లల చదువును ప్రోత్సహిద్దాం


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

పాలకొల్లు అర్బన్, న్యూస్‌టుడే: ఆడ పిల్లల చదువులను ప్రోత్సహిద్దామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డి.మహేశ్వరరావు అన్నారు. లంకలకోడేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో- బేటీ పఢావో పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు


విద్యార్థినికి ధ్రువపత్రం ఇస్తున్న ప్రధానాచార్యులు

ఆచంట(మార్టేరు), న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కన్వీనర్, భీమవరం ఐటీఐ కళాశాల ప్రధానాచార్యుడు వేగేశ్న శ్రీనివాసరాజు అన్నారు. ఆచంట ఐటీఐ కళాశాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు గురువారం ధ్రువపత్రాలు అందజేశారు. కళాశాల ప్రధానాచార్యుడు ఇందుకూరి వెంకట సత్యనారాయణరాజు అధ్యక్షత వహించారు. అంతకుముందు మొదటి ఏడాది విద్యార్థులకు స్వాగతోత్సవం నిర్వహించారు. కళాశాల సూపరింటెండెంట్ జీవీఎస్ రెడ్డి, డి.సుబ్రహ్మణ్యం, కార్తికేయ, వెంకటరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

మార్టేరు, న్యూస్‌టుడే: పెనుగొండ 132 కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో నిర్వహణ పనుల రీత్యా శుక్రవారం పెనుమంట్ర మండలంలోని అన్ని గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బి.సురేశ్‌కుమార్ తెలిపారు. మార్టేరు, ఆలమూరు, పెనుమంట్ర విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని గురువారం కోరారు.

ర.భ.శాఖ ఏఈఈగా బాధ్యతల స్వీకరణ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రహదారులు, భవనాల శాఖ ఏఈఈగా కేటీ ప్రసన్నబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడ ర.భ.శాఖలో నాణ్యత పరిశీలన విభాగంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నరసాపురంలో విధులు నిర్వర్తిస్తున్న టి.నిక్సిటెజ్ ఆర్నిల్ల కిందట రాజమహేంద్రవరం డీఈఈగా బదిలీపై వెళ్లారు.

ఎంపీడీవో పద్మజ బదిలీ

పెనుమంట్ర, న్యూస్‌టుడే: ఎంపీడీవో పద్మజ బదిలీ అయ్యారు. ఆమె ఎన్నికల ముందు విశాఖపట్నం నుంచి ఉద్యోగోన్నతిపై ఇక్కడికొచ్చారు. అంతర జిల్లాల బదిలీల్లో భాగంగా ఆమెను విశాఖపట్నానికి బదిలీ చేశారు. ఇన్‌ఛార్జి బాధ్యతలను ఈవోపీఆర్డీ రాంప్రసాద్‌కు అప్పగించారు.

సత్యవరంలో అన్నసమారాధన

పెనుమంట్ర, న్యూస్‌టుడే: సత్యవరం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద గురువారం అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారి మహోత్సవాల ముగింపు సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

అనుసంధానమయ్యేనా... అవస్థలు తీరేనా!

అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్లు



జిల్లా, డివిజన్ కేంద్రాల్లోని రెండు ప్రధాన నియోజకవర్గాల గ్రామాలను అనుసంధానించే ప్రధాన రహదారి నిర్మాణాన్ని గత వైకాపా ప్రభుత్వం విస్మరించింది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అప్పటి అధికార పార్టీ నేతలు, అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఒక్క అడుగూ ముందుకుపడలేదు. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– న్యూస్‌టుడే, నరసాపురం

మొగల్తూరు మండలం కోమటితిప్ప పంచాయతీ, భీమవరం నియోజకవర్గంలోని కోమటితిప్పసార్ పంచాయతీల అంతర్గత రహదారులు కలిసుంటాయి. కోమటితిప్పసార్ పరిధిలోని సుమారు 200 మీటర్ల మేర అంతర్గత, 300 మీటర్ల మేర ప్రధాన రహదారులు అసంపూర్తిగా ఉన్నాయి. కోమటితిప్పసార్ నుంచి దిరుసుమర్రు వరకూ సుమారు ఏడు కిలో మీటర్ల పొడవున్న ర.భ.శాఖ రోడ్డును రూ.9 కోట్లతో తారురోడ్డు అభివృద్ధి చేశారు. మొగల్తూరు మండలం కోమటితిప్ప నుంచి కాళీపట్నం- భీమవరం రహదారిపై దెయ్యాలతిప్ప మీదుగా భీమవరం వెళ్లడం కంటే... పాలకొల్లు మీదుగా గ్రామీణ రహదారి వరకూ నిర్మించిన ఈ మార్గం దగ్గరవుతుంది. అయితే అసంపూర్తి పనులతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దెబ్బతిన్న కల్వర్టులు..

కోమటితిప్ప నుంచి దిరుసుమర్రు వరకూ నిర్మించిన రహదారిలో మూడు కాలువలపై వంతెనలు నిర్మించలేదు. గతంలో ఏర్పాటు చేసిన పైపు కల్వర్టులు అలాగే వదిలివేశారు. పలితంగా వాహనాలు అదుపుతప్పి కాలువల్లోకి తీసుకెళ్తున్నాయి. ఆయా ఘటనల్లో పలువురు గాయాలపాలయ్యారు. అధికారులు స్పందించి అసంపూర్తి రోడ్డును పూర్తి చేయడంతో పాటు కాలువలపై కల్వర్టుల స్థానంలో వంతెనలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


కోమటితిప్ప- దిరుసుమర్రు మార్గంలో వంతెన నిర్మించాల్సిన ప్రాంతం

అందరికీ ప్రయోజనం



రోజూ వివిధ గ్రామాల నుంచి భీమవరానికి పలువురు విద్యార్థులు, ప్రజలు సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అర్ధాంతరంగా ఆపేసిన రోడ్డును పూర్తి చేస్తే అందరికీ ప్రయోజనంగా ఉంటుంది. ఆక్వా ఉత్పత్తుల రవాణాకూ ఇబ్బంది ఉండదు.

– మేకల కుమార్, కోమటితిప్ప

మా గోడు పట్టించుకోలేదు



కోమటితిప్పలోని అసంపూర్తి రోడ్డు పూర్తి చేయాలని గత పాలకులు, అధికారులకు మొరపెట్టుకున్నాం. వారెవరికీ మా గోడు పట్టలేదు. కోమటితిప్పలో 500 మీటర్ల రోడ్డు, భీమవరం మండలంలోని రహదారిపై కల్వర్టుల స్థానంలో వంతెనలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– పులపర్తి సూర్యనారాయణ, సర్పంచి, కోమటితిప్ప

త్వరలో టెండర్లు పిలుస్తాం

కోమటితిప్పసార్‌లో అసంపూర్తి రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ పనులు చేసేందుకు త్వరలోనే టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగిస్తాం. భీమవరం మండలంలోని రహదారి, వంతెనల నిర్మాణానికి నిధులు విడుదల కావాల్సి ఉంది.

– కిరణ్‌కుమార్, ర.భ.శాఖ డీఈ, నరసాపురం

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: సిద్ధాంతం ప్రధాన రహదారి మూలాలదిబ్బ సమీపంలో చెత్తాచెదారాలు పడేస్తున్నారు. ఈ వ్యర్థాల రోడ్డుపైకి వస్తుండటంతో రాకపోకలు సాగించలేక పోతున్నాం. దుర్వాసన వస్తుండటంతో ముక్కులు మూసుకొని ప్రయాణించాల్సి వస్తోంది.

– గణేశ్‌రావు, సిద్ధాంతం

సమాధానం: రోడ్డును పరిశీలించి చెత్తాచెదారాలను శుభ్రం చేయిస్తాం.

– అచ్యుత రామకృష్ణ, ఇన్‌ఛార్జి కార్యదర్శి

వంద రోజుల్లోనే ప్రజల మన్ననలు

ఎమ్మెల్యేలు పితాని, బొమ్మిడి

మార్టేరు, ఆచంట, మొగల్తూరు, పెనుగొండ గ్రామీణ- న్యూస్‌టుడే: వంద రోజుల పాలనలోనే ఎన్డీయే ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందిందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మార్టేరు, పెనుమంచిలి గ్రామాల్లో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పితాని మాట్లాడుతూ... వంద రోజుల్లోనే మెగా డీఎస్సీ ప్రకటన, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, పింఛను సొమ్ము పెంపు, డ్వాక్రా మహిళలకు రుణ మంజూరు సొమ్ము పెంపు తదితర హామీలు అమలు చేసిందన్నారు. గర్భిణులను సామూహిక సీమంతాలు చేసి చీర, పండ్లు, మిఠాయిలు అందజేశారు. తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు ఉద్దరాజు వెంకటరామరాజు, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేశ్, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు. ✦ ప్రజాభివృద్ధే ఎన్డీయే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. కోమటితిప్పలో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సర్పంచి పులపర్తి ఏసు అధ్యక్షత వహించారు. ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన ప్రగతి, సంక్షేమ పథకాల అమలుపై ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. మొగల్తూరులో తెదేపా మండలాధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ✦ ఆచంట మండలంలోని అయోధ్యలంక, మర్రిమూల గ్రామాల్లో ఎన్డీయే నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. నెగ్గిపూడి పంచాయతీలో గర్భిణులకు సీమంతాలు చేశారు. వారికి చీర, పండ్లు, స్వీట్లు అందజేసి ఆశీర్వదించారు. ✦ పెనుగొండ మండలం ములపర్రులో గుత్తుల లోకేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.


పెనుమంచిలిలో ప్రతిజ్ఞ చేస్తున్న సత్యనారాయణ తదితరులు


కోమటితిప్పలో మాట్లాడుతున్న నాయకర్

ఉల్లాసంగా... ఉత్సాహంగా..

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో పీఈటీలు

యలమంచిలి, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యం గురువారం జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్-14, 17 విభాగాల్లో పోదూరు, యలమంచిలి, పాలకొల్లు మండలాల బాలబాలికలు పోటీపడ్డారు. అండర్-14 బాలుర విభాగంలో ఎం.ర్యాన్, డి.నిఖిల్ వర్మ, కె.కిరీటి, బి.వర్షిత్ ఆదిత్య, బాలికల విభాగంలో ఎన్.అనన్య, ఎం.మోహనలక్ష్మి, బి.వైష్ణవి, కె.ఏంజెల్ ఎంపికయ్యారు. అండర్-17 బాలుర విభాగంలో ఎం.చరణ్ సూర్య, టి.వీరభద్ర శివతేజ, కె.సుధాకర్, బాలికల విభాగంలో జి.ప్రియాంక, కె.గాణేశ్వరి, ఎం.సుజల అర్హత సాధించారు. వ్యాయామ ఉపాధ్యాయులు యాండ్ర సత్యనారాయణ, రేలంగి రామకృష్ణ, కాసా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా... మార్టేరు, న్యూస్‌టుడే: స్థానిక శ్రీవేణుగోపాల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాలబాలికల విభాగాల్లో షటిల్, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్, పరుగుపందెం పోటీలు నిర్వహించారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు పీడీలు నిరాయకర్రి, విరంజీవి, నరేశ్, సుజాత తదితరులున్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


కమిటీ సభ్యులతో నాయకులు

నరసాపురం, న్యూస్‌టుడే: స్థానికంగా ఓ కల్యాణ మండపంలో గురువారం రాయల్ క్లబ్ జాతీయ కార్యవర్గ ప్రమాణస్వీకారం అట్టహాసంగా నిర్వహించారు. జాతీయ కార్యవర్గ అధ్యక్షుడిగా డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణరావు, ఉపాధ్యక్షులుగా ఎస్.విజయకుమార్, ఆంజనేయులు, కార్యదర్శిగా రంగినీడి వెంకటసుబ్బారావు, సంయుక్త కార్యదర్శిగా తిరుమలశెట్టి ఉదయభాస్కరరావు, కోశాధికారిగా నూటక్కి సత్యనారాయణ, కమిటీ పాస్ట్ అధ్యక్షుడిగా సుంకర కృష్ణ, కార్యనిర్వాహక సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజారామమోహన్‌నాయుడు తదితరులు హాజరయ్యారు.

పశువులు.. ప్రమాద హేతువులు!

నరసాపురం పట్టణంలో మూగజీవాల బెడద అధికంగా ఉంటోంది. యజమానులు వదిలేస్తుండటంతో అవి రోడ్లపై ఇష్టానుసారంగా సంచరిస్తున్నాయి. ఉన్నట్టుండి ఎటుపడితే అటు పరుగులు తీస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రివేళ పశువులను గుర్తించక.. వాటిని ఢీకొని ఆసుపత్రి పాలవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. రోడ్లపై మూగజీవాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు.



– న్యూస్‌టుడే, నరసాపురం

స్తంభానికి తుప్పు... పొంచిన ముప్పు!

నరసాపురం పట్టణం ఎన్టీఆర్ మాల్‌లో ఓ విద్యుత్తు స్తంభం అడుగు భాగాన తుప్పుపట్టి ప్రమాదకరంగా మారింది. ఈ రేవులో స్నానాలు, పుణ్య కార్యక్రమాలు నిర్వహణకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వందలాది మంది సంచరించే ప్రాంతంలో స్తంభం ప్రమాదకరంగా ఉండటంతో... ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్తు స్తంభం మార్పునకు చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు.



– న్యూస్‌టుడే, నరసాపురం

ఊడిన తలుపులు.. దెబ్బతిన్న కిటికీలు

పెనుగొండ బాలుర కళాశాల వసతి గృహంలో సుమారు 90 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ నాలుగు గదులుండగా- రెండింటికి తలుపులేవు. వసతి గృహం ప్రధాన ద్వారానికి చెద పట్టి ఎప్పుడూ నేలకూలుతుందో తెలియని పరిస్థితి. కిటికీలూ దెబ్బతిన్నాయి. దోమలు దండయాత్ర చేస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే పైకప్పు నుంచి నీరు ఉరుస్తోంది. వసతి గృహంలో సదుపాయాలు కల్పించాలని ఉన్నతాధికారులకు నివేదించామని వసతి గృహ సంక్షేమాధికారిణి వై.పద్మజ తెలిపారు.





– న్యూస్‌టుడే, పెనుగొండ

ఔషధ దుకాణాల తనిఖీ

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణం, గ్రామీణ మండలంలోని ఔషధ దుకాణాలను ఔషధ నియంత్రణాధికారి మల్లికార్జునరావు గురువారం తనిఖీ చేశారు. ఈ నెల 25న వేములదీవిలో స్వాధీనం చేసుకున్న దుకాణ తాళాలు తిరిగి యజమానికి అప్పగించారు. దుకాణ నిర్వాహణలో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అపస్మారక స్థితిలో వృద్ధురాలు... ఆసుపత్రికి తరలింపు

మొగల్తూరు, న్యూస్‌టుడే: ముత్యాలపల్లిలో అనారోగ్యంతో అపస్మారక స్థితికి చేరుకున్న వృద్ధురాలిని ఉపాధ్యాయుడు చింతపల్లి బోరవతో గురువారం 108 వాహనంలో నరసాపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. తన వివరాలు తెలియజేయలేని దీనస్థితిలో ఉన్న వృద్ధురాలిని ఈ నెల 25న ఉపాధ్యాయుడు గుర్తించి సపర్యలు చేశారు. 'హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి నాగిడి రాంబాబు, సీడీపీవో బి.ఉర్మిళకు సమాచారం అందించారు. వారి సూచనలతో పలువురు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు వృద్ధురాలిని ఆసుపత్రిలో చేర్పించారు.

13 మంది అరెస్టు

పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక గాంధీబొమ్మల కూడలి సమీపంలో ఓ లాడ్జిలో జూదం ఆడుతున్న 13 మందిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.40,340 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొప్పిశెట్టి గంగాధర్ తెలిపారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

పెనుగొండ, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పంచాయతీ కార్యదర్శి పి.అమృతరామకృష్ణ అన్నారు. వడలి పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు వీధుల్లో చేపట్టి చెత్తాచెదారాలు తొలగించారు. ఉప సర్పంచి వి.నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర-2047' కరపత్రాల పంపిణీ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలు సంబంధించి రూపొందించిన 'స్వర్ణాంధ్ర- 2047' కరపత్రాలను 27 వేల కుటుంబాలకు పంపిణీ చేసినట్లు ఈవోపీఆర్డీ జి.ఆంజనేయశర్మ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ... ఎన్డీయే అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రహదారులకు మహర్దశ!

మరమ్మతులకు రూ.2.18 కోట్లు మంజూరు


రుస్తుంబాద- మంగలగుంటపాలెం మార్గం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: మొగల్తూరు, నరసాపురం మండలాల్లోని తొమ్మిది రహదారులకు మహర్దశ పట్టనుంది. అత్యవసర మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం రూ.2.18 కోట్లు మంజూరు చేసింది. గత వైకాపా ప్రభుత్వం రోడ్ల బాగోగులను విస్మరించడంతో... అధ్వాన స్థితికి చేరుకున్నాయి. తాజా వరదలు, భారీ వర్షాలతో మరింత ఛిద్రంగా తయారయ్యాయి. ప్రజలు ఇబ్బందులను గుర్తించిన ఎన్డీయే ప్రభుత్వం రహదారుల తక్షణ మరమ్మతులకు నిధులు విడుదల చేసింది. ఫలితంగా ఆయా రోడ్ల రూపురేఖలు మారనున్నాయి.

తొమ్మిది మార్గాల్లోనే.. వెంప- కాళీపట్నం రోడ్డుకు ప్రభుత్వం అత్యధికంగా రూ.40 లక్షలు కేటాయించింది. రుస్తుంబాద- కొప్పర్రు, కొండవీటి కొడప- మోడి, ముత్యాలపల్లి- వారతిప్ప, కొత్తపాలెం- జగన్నాథపురం రహదారులకు రూ.25 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. పసలదీవి- మొగల్తూరు వయా రామన్నపాలెం రోడ్డుకు రూ.15 లక్షలు, పేరుపాలెం- పేటిమొండి రహదారికి రూ.10 లక్షలు, మెట్రేవు- కేపీ పాలెం, చెల్లెపల్లి దిండిపల్లవ పాలెం రహదారులకు రూ.2 లక్షలు విడుదలయ్యాయి. 'నిధులు మంజూరైన రహదారుల మరమ్మతులకు టెండర్లు నిర్వహించాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక పనులు ప్రారంభిస్తాం' అని ర.భ.శాఖ డీఈఈ జీవీఎస్ కిరణ్‌కుమార్ తెలిపారు.

పంట నష్టపరిహారం విడుదల

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: వరదలు, అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ.1.20 కోట్లు విడుదల చేసినట్లు వ్యవసాయాధికారి ఎం.శామ్యూల్ జాన్సన్ గురువారం తెలిపారు. మండలంలోని 1270 ఎకరాల్లో 1090 మంది రైతుల వరి పొలాలు ముంపు బారిన పడ్డాయన్నారు. వీరందరికీ ఎకరాకు రూ.10 వేలు చొప్పున పరిహారం అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఫ్లెక్సీ తొలగింపు హేయం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: కళ్ల మండలం ఏలూరుపాడులో బి.ఆర్.అంబేడ్కర్ ఫ్లెక్సీని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తొలగించడం హేయమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేశ్ అన్నారు. స్థానిక గాంధీ బొమ్మల కూడలిలో గురువారం అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం ధర్నా చేశారు. పి.వి.రావు, వరప్రసాద్, నగేశ్‌బాబు, ప్రభాకర్, నరసింహారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ

మొగల్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. నాయకులు పెద్దిరాజు, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

రథానికి రక్షణేది?

రైస్‌మిల్లు ఆరుబయట ఉంచిన వైనం


బరకాలతో కప్పిన రథం

పాలకొల్లు అర్బన్, న్యూస్‌టుడే: పాలకొల్లు యడ్ల బజారులోని శ్రీఅభివృద్ధి కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు, దాతలు తోడ్పాటునందిస్తున్నారు. వస్తు, ధన రూపాల్లో విరాళాలిస్తున్నారు. ఏటా అమ్మవారి కల్యాణానికి రథోత్సవం నిర్వహిస్తుంటారు. స్థానిక క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో రథం తీసుకొచ్చి ఉత్సవమూర్తులను ఊరేగించేవారు. రెండేళ్ల క్రితం గుత్తం నాగబాబు దంపతులు సుమారు రూ.20 లక్షలతో రథం చేయించి ఆలయానికి కానుకగా సమర్పించారు. ప్రస్తుతం రథానికి రక్షణ కరవైంది. కొన్నాళ్లు ఆలయం వెలుపలే ఉంచారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తుండటంతో భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. అధికారులు స్పందించి పెంటపాడు వెళ్లే మార్గంలోని ఓ రైస్‌మిల్లు ప్రాంగణంలో ఉంచారు. అక్కడా బరకాలు కప్పి బహిరంగంగా వదిలేశారు. విద్యుత్తు పరివర్తక పక్కన ఉండటం గమనార్హం.

చర్యలు తీసుకున్నాం..

రథం భద్రపరిచేందుకు స్థలాన్ని కేటాయిస్తాం. త్వరలోనే షెడ్డు నిర్మిస్తాం. అగ్ని మాపక కేంద్రం రహదారి ఆవరణలో రథాన్ని భద్రపరిచేలా చర్యలు తీసుకున్నాం. ఈ రథం ఆ శాఖాధికారులతో సంప్రదింపులు చేశాం.

– సతీశ్‌కుమార్, ఆలయ ఈవో

త్వరితగతిన గృహ నిర్మాణాల పూర్తి

పెనుగొండ, న్యూస్‌టుడే: మండలంలో అసంపూర్తి గృహ నిర్మాణాలను మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలని ఈవోపీఆర్డీ సీహెచ్‌విశ్వేశ్వరరావు సూచించారు. వడలి పంచాయతీ కార్యాలయంలో గురువారం 'మన ఇల్లు- మన గౌరవం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. గృహనిర్మాణ సంస్థ ఏఈ డి.లక్ష్మణరావు, కార్యదర్శి పి.అమృతరామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో

అవీ ఇవీ అన్నీ

గురువారం ఆయన పర్యటించారు. చేపల మార్కెట్‌లోని దుకాణ సముదాయాన్ని పరిశీలించారు. పరిసరాల శుభ్రతపై సిబ్బందికి సూచనలు చేశారు.

సమాజంపై అవగాహన పెంచుకోవాలి

పెనుగొండ, న్యూస్‌టుడే: పోటీ ప్రపంచంలో సమాజంపై అవగాహన పెంచుకోవాలని ప్రధానాచార్యులు ఎస్తేర్ క్వీన్ సూచించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఢిల్లీ దర్శించి వచ్చిన సందర్భంగా వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా వంట పాలల, ధాన్యపు మిల్లుల ఆవశ్యకత, పనితీరును విద్యార్థినులకు తెలియజేశారు.

కల్తీ లడ్డూ బాధ్యులను శిక్షించండి


వేంకన్న చిత్రపటంతో ప్రదర్శన చేస్తున్న తెలుగు మహిళలు, ధార్మిక సంఘాల సభ్యులు

నరసాపురం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూను కల్తీ చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు, ధార్మిక సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలో స్వామివారి చిత్రపటంతో ప్రదర్శన చేపట్టారు. అంతకుముందు వేములదీవిలోని వైభవ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆపై కోటి క్షమాపణ యజ్ఞంలో భాగంగా క్షమాపణ మంత్రం పఠించారు. తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు కిరిగినీడి రాజ్యలక్ష్మి, బండి సర్వలత, పిప్పళ్ల సుప్రజ, సుంకర రాజకుమారి, మానేపల్లి నాగమణి పాల్గొన్నారు.

తక్కువ ధరకే ఆర్టీసీ కార్గో సేవలు


దస్త్రాలు పరిశీలిస్తున్న ఏటీఎం సుబ్బారావు

మార్టేరు, న్యూస్‌టుడే: తక్కువ ధర, సమయంలోనే ఆర్టీసీ కార్గో సరుకుల రవాణా చేస్తోందని ఏపీఎస్ ఆర్టీసీ ఉమ్మడి జిల్లా కార్గో ఏటీఎం సుబ్బారావు తెలిపారు. స్థానిక కార్గో పార్శిల్ సర్వీస్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఏటీఎం మాట్లాడుతూ... వినియోగదారులతో సఖ్యతగా వ్యవహరించాలన్నారు. తద్వారా కార్గో సేవలను విస్తృతం చేయాలన్నారు. అనంతరం నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్గో నరసాపురం డీఎం శివప్రసాద్, నిర్వాహకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

స్వర్ణాంధ్ర సాధనకు సహకరించండి

పెంటపాడు, న్యూస్‌టుడే : స్వర్ణాంధ్ర సాధనకు ప్రజలంతా సహకరించాలని సర్పంచి పీతల సత్యనారాయణ అన్నారు. గురువారం పెంటపాడు మండలం కస్పాపెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర సాధనపై గ్రామసభ నిర్వహించారు. సర్పంచి మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా పంచాయతీ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి అప్పారావు, ఎన్డీయే నాయకులు నరాలశెట్టి సంతోష్, మల్లెల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● మోండిపాడు సచివాలయం వద్ద జరిగిన గ్రామసభలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ పాతూరి రామ్ ప్రసాద్‌చౌదరి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర గోడపత్రాన్ని ఆవిష్కరించారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇరగవరం పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో మహేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. వర్షాకాలంలో రోగాలు ప్రబలుతున్నాయని వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని పేర్కొన్నారు.

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: మండలానికి మంజూరైన గృహాలన్నింటిని మార్చి నాటికి పూర్తి చేయాలని, లేకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే సాయం అందదని ఎంపీడీవో రాజ్‌మనోజ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో గురువారం 'మన ఇల్లు- మన గౌరవం' కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

విద్యార్థుల ప్రతిభ



తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. నాగదుర్గ, అభిజ్ఞ, మేఘన, సందీప్, లోకేశ్ ఎంపికయ్యారని వివరించారు.

దుకాణాల తనిఖీ

ఈనాడు స్పందన

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: 'రోగాలు అమ్మబడును' శీర్షికన 23న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని పలు మిఠాయి దుకాణాల్లో గురువారం అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ తనిఖీలు చేపట్టారు. దుకాణాల వద్ద పరిసరాలు పరిశీలించారు. నిల్వ ఉంచిన పదార్థాల నమూనాలు సేకరించి, ల్యాబ్‌కు పంపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'ఉత్తర్వులు రద్దు చేయాలి'


తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన 117 ఉత్తర్వులు రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను రక్షించాలని ఏపీటీఎఫ్ పూర్వ కార్యదర్శి రాజగోపాల్ కోరారు. వేల్పూరు, కొమరవరం, మండపాక, పైడిపర్రు తదితర గ్రామాల్లో పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టి నమోదు పత్రాలు అందజేశారు.

వ్యాయామం తప్పనిసరి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రతి రోజు వ్యాయామం తప్పనిసరిగా చేయాలని గుండె వైద్య నిపుణులు వెంకటేశ్ సూచించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో మస్తాన్‌రావు అధ్యక్షతన గుండె వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే మంచి నిద్ర అవసరమన్నారు. కార్యదర్శి సిద్ధార్థ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై.. దోమల దండయాత్ర..!

విజృంభిస్తున్న జ్వరాలు



పెంటపాడు, తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే : తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. కొన్ని రోజులుగా వర్షాలు పడుతుండటంతో పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. తాడేపల్లిగూడెం పట్టణంలో ప్రాంతీయ ఆసుపత్రి, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలాల్లో పీహెచ్‌సీలు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి.

☛ పెంటపాడు మండలం మీనవల్లూరులోని కొత్తకాలనీకి చెందిన శ్రీనివాస్ పదిహేను రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ముదునూరు పీహెచ్‌సీకి వెళ్తే సీజనల్ జ్వరమేనని అక్కడి వైద్యులు చెప్పి మందులు ఇచ్చి పంపేశారు. ఎంతకీ జ్వరం తగ్గకపోవడంతో తణుకు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే అక్కడ పరీక్షలు నిర్వహించి డెంగీగా నిర్ధారించి వైద్యం అందిస్తున్నారు.

☛ పెంటపాడు బీకేకాలనీకి చెందిన లక్ష్మి నెల రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. తాడేపల్లిగూడెంలోని ఓ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహిస్తే డెంగీగా నిర్ధారించారు. ఆమె ఇంటికి సమీపంలోని చెరువుల్లో మురుగు, వ్యర్థాల వల్ల తరచూ జ్వరాల బారిన పడుతున్నామని పంచాయతీ సిబ్బందికి చెప్పినా కనీసం వారు పట్టించుకోవడం లేదని వాపోయారు.

☛ తాడేపల్లిగూడెం పట్టణ పరిధిలో ఈ వర్షాకాలంలో నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. టైఫాయిడ్, మలేరియా జ్వరాలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.

పెరిగిన ఓపీ కేసులు

తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో విషజ్వరాల బారినపడిన వారు రోజుకు 150 నుంచి 200 మంది చికిత్స నిమిత్తం వస్తున్నారు. వైద్యులు పరీక్షించి అవసరమైన వారిని వార్డులో చేర్చుకుంటున్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరం, వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీలు, పెంటపాడు మండలంలోని పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీలకు రోజుకు 30 నుంచి 50 వరకు జ్వరపీడితులు వస్తున్నారు.

పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీల్లో గడిచిన మూడు నెలలుగా ఓపీ వివరాలు ఇలా..

జులై	115
ఆగస్టు	130
సెప్టెంబరు	145

వైకాపా హయాంలో గాడి తప్పిన పాలన


గత వైకాపా ప్రభుత్వం పంచాయతీలపై చిన్నచూపు చూసింది. ఒక్కపైసా నిధులు కేటాయించకపోగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించింది. పంచాయతీల్లో పాలన అధ్వానంగా మారింది. సర్పంచులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం పారిశుద్ధ్య పనులు చేయించలేని పరిస్థితి నెలకొంది. ఎక్కడపడితే అక్కడ చెత్త మేట వేసింది. డ్రెయిన్లు, ఖాళీ స్థలాలు మురుగు, వ్యర్థాలతో నిండిపోయాయి. అయిదేళ్లలో దోమల నివారణ మందు పిచికారీ చేసిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.

పంచాయతీలకు సమకూర్చిన ఫాగింగ్ యంత్రాలు నిరుపయోగంగా మూలకు చేరాయి. కొన్ని పంచాయతీల్లో పాలకులు తమ సొంత నిధులు వెచ్చించి పనులు చేశారు. రూ.లక్షలు ఖర్చుచేసినా ఇప్పటివరకు ఆ బిల్లులకు మోక్షం కలగలేదు.

కారణాలు ఇవే

☛ గూడెం పురపాలకంలో 300 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉండాలి. కాని 220 మందే అందుబాటులో ఉన్నారు. రోజుకు 8 టన్నుల చొప్పున పట్టణం చెత్త వస్తుంది. దీనికి సేకరించడానికి అరకొర సిబ్బందితో వెతలు తప్పడం లేదు.

☛ పట్టణంలోని ఖాళీ స్థలాలు 2000కు పైగా ఉన్నాయి. వీటిలో చెత్త పేరుకుపోతోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి.





పెంటపాడు: వ్యర్థాలతో నిండిన చెరువు

“నియోజకవర్గంలో జ్వరాల వ్యాప్తి ఎక్కువగా ఉంది. జ్వరంతో పాటు ఒళ్లునొప్పులు, తలనొప్పి, వాంతులు, నీరసం, చలి, వణుకు, తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుని సంప్రదించాలి. పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి. దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం శ్రేయస్కరం. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే వైరల్ జ్వరాలు బారిన పడకుండా ఉండవచ్చు” అని మలేరియా సబ్‌యూనిట్ అధికారి లక్ష్మణ రావు అన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: బొలిశెట్టి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్, నాయకులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధి దిశగా ఎన్డీయే నాయకులు పని చేస్తారని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. రామన్నగూడెంలో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు, నాయకులతో కలిసి జల్‌జీవన్ పైపులైన్, రహదారుల అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. తెదేపా మండల అధ్యక్షుడు రవికుమార్, సర్పంచి వెంకట్రావు, రవితేజ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ భీమవరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నాగరాణిని గురువారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించి పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించి వినతి పత్రం అందజేశారు.

ప్రజా సంక్షేమంపైనే దృష్టి: ఆరిమిల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం ఇరగవరం మండలం రేలంగిలో ప్రజా వేదిక నిర్వహించారు. సీడీపీవో ప్రమోదిని కుమారి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. పౌష్టికాహార స్టాల్స్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. గత వైకాపా పాలన రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిందని గుర్తు చేశారు. పవిత్రంగా భావించే తిరుపతి లడ్డూలో వాడే ఆవు నెయ్యిని కూడా కల్తీ చేసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు.

ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం.. **తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** ప్రయాణికులకు మెరుగైన సేవలందించడానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద గురువారం ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభించారు. ముందుగా స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా డిపో ఆవరణలో మొక్క నాటారు. అనంతరం బస్సులో కొంత దూరం ప్రయాణించారు. డిపో సిబ్బంది, యూనియన్ నాయకులు రాధాకృష్ణను ఘనంగా సత్కరించారు. డిపో మేనేజర్ సప్పా గిరిధర్‌కుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మంచి అలవాట్లతోనే ఆరోగ్యం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: మంచి అలవాట్లే ఆరోగ్యానికి రక్షణ అని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు అన్నారు. వెంకట్రామన్నగూడెం ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదతాడేపల్లిలో అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ భీమడోలు రాజారావు, ఆరోగ్య కార్యదర్శులు జ్యోతి, లక్ష్మి తదితరుల పాల్గొన్నారు.

నడకతో.. **తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** నడకతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వాకర్స్ ఇంటర్నేషనల్ ఆర్సీ నరసింహమూర్తి అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని విద్యార్థులతో ఎయిర్‌స్ట్రిప్ మహిళావాకర్స్ అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. నడకతో కలిగే ప్రయోజనాలు వివరించారు. మేరీ వజ్రమ్మ, కనకదుర్గ, ఇందిరాకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు డంపింగ్ యార్డు వద్ద నివసిస్తున్న మహిళ అస్వస్థతకు గురై, చికిత్స పొందుతున్నారు. ఉందుర్తి పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పైడిపర్రు, తేతలి లయన్స్ క్లబ్‌ల సహకారంతో అధ్యక్షుడు ప్రసన్న కుమార్ బాధితురాలికి రూ.10,000 సాయమందించారు.

బాధిత కుటుంబాలకు చేయూత

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఆరుగొలనులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జనసేన ,తెదేపా కార్యకర్తలు సత్తి పండు, బాలాజీ కుటుంబాలకు రూ.26 వేలు చొప్పున ఎన్డీయే నాయకుల ఆధ్వర్యంలో గురువారం అందజేశారు.

మీ ఇంటికి విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నాం

వినియోగదారులపై సైబర్ మోసగాళ్ల వల

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే



గతంలో ఎక్కువగా ఇంటి దొంగతనాలు, వాహన చోరీలు ఎక్కువగా వినేవాళ్లం. ప్రస్తుతం ఆన్‌లైన్ దొంగతనాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. సాంకేతికంగా వస్తున్న మార్పులకనుగుణంగా మోసగాళ్లు రోజుకో కొత్త అవతారం ఎత్తుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

విద్యుత్తు వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని సంక్షిప్త సందేశాలు పంపుతున్నారు. 'గత నెల విద్యుత్తు బకాయి నవీకరణ కాకపోవడంతో మీ ఇంటి విద్యుత్తు కనెక్షన్ నిలిపేస్తున్నాం. తక్షణమే ఈ నంబర్‌కు కాల్ చేయండి'.

'విద్యుత్తు బిల్ బకాయి 24 గంటల్లోపు చెల్లించాలి. దీనికి సంబంధించి లింక్ పంపుతున్నాం' వంటి సందేశాలు పంపుతూ మోసం చేస్తున్నారు.

☛ మండపాకకు చెందిన రాజా అనే వ్యక్తికి 'గత నెల విద్యుత్తు బిల్లు అప్‌డేట్ కాకపోవడంతో రాత్రి 9.30 గంటలకు సరఫరా నిలిపేస్తున్నాం. అంతరాయం లేకుండా ఉండేందుకు తక్షణమే ఈ నంబరుకు కాల్ చేయడండి' అంటూ ఒక నంబర్ పంపించారు. అతను ఈ సందేశాన్ని విద్యుత్తు శాఖ సిబ్బందికి పంపడంతో ఆ సమాచారం మోసగాళ్లు పంపిందేనని తెలుసుకున్నారు.

☛ ఇటీవల ఓ కేటుగాడు ఏకంగా గుంటూరు విద్యుత్తు శాఖ ఎస్ఈకి ఫోన్ చేసి బిల్లు చెల్లించాలని సూచించడంతో ఆయన సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వీళ్లే ఎందుకు..?

గృహ, దుకాణం విద్యుత్తు బిల్లులు చెల్లించడానికి ఇప్పటి వరకు ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్‌లను వినియోగించారు. ఇటీవల ఈ యాప్‌ల ద్వారా చెల్లింపును రద్దు చేశారు. ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈస్ట్రన్ పవర్ పేరుతో ప్లేస్టోర్‌లోని యాప్ ద్వారా మాత్రమే బిల్లులు చెల్లించాలని సంస్థ ఇప్పటికే సూచనలు చేసింది. ప్లే స్టోర్ నుంచి ఏపీఈపీడీసీఎల్ లేదా ఈస్ట్రన్ పవర్ అని టైప్ చేస్తే మొదటిగా వచ్చే యాప్‌ను మన ఫోనులో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. విద్యుత్తు సర్వీసు నంబరు నమోదు చేస్తే బిల్లు ఎంత అన్నది స్పష్టంగా సంఖ్య రూపంలో కనిపిస్తుంది. ఆన్‌లైన్ మోసగాళ్లు ఈ కొత్త మార్గాన్ని ఎంచుకుని పలువురుకు లింక్‌లు, నంబర్లు, ఏపీకే ఫైల్ పంపుతూ గాలం వేస్తున్నారు.

“ఇలాంటి మేసేజ్‌లు, లింక్‌లు క్లిక్ చేయవద్దు. ఇలాంటివి వస్తే తక్షణమే సైబర్‌క్రైమ్‌కి ఫిర్యాదు చేయాలి. బిల్లులు చెల్లించాలంటే మా వెబ్‌సైట్ లేదా, ప్లేస్టోర్‌లోని ఈపీడీసీఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని మాత్రమే చెల్లించాలి.” అని డీఈఈ రామకృష్ణ అన్నారు.

నిబంధనలకు నీళ్లు..!

ఇంజినీరింగ్ విభాగంలో అధికారి చేతివాటం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే



పైపులైను ఏర్పాటు చేసిన ప్రదేశం

అవినీతి అక్రమాలకు తాడేపల్లిగూడెం పురపాలక సంఘం అడ్డాగా మారింది. తాజాగా మంచినీటి పనుల్లోనూ ఇంజినీరింగ్ విభాగంలో ఓ అధికారి తన చేతివాటాన్ని ప్రదర్శించారు. అనుమతులు లేకుండానే పైపులైన్లు ఏర్పాటు చేసి పెద్ద మొత్తంలో లబ్ధి పొందారనే ఆరోపణలు ఉన్నాయి. తాడేపల్లిగూడెం పురపాలక సంఘం మంచి నీటి పనుల విభాగంలో జరుగుతున్న అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. మొన్నటి వరకు మంచి ట్యాంకులను అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకున్న సిబ్బంది నేడు మరో అడుగు ముందుకేశారు. కడకట్ల ఈతకొలను సమీపంలో ఓ లేఅవుట్‌కు ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారి అనధికారికంగా నాలుగు అంగుళాల పైపును సుమారు 250 మీటర్ల మేర వేయించారు. దీనికి వినియోగించిన పైపులు, ఇతర పరికరాలు, సిబ్బంది మున్సిపాలిటీకి సంబంధించినవనే ఆరోపణలు ఉన్నాయి. దీని కోసం లేఅవుట్‌దారుల నుంచి పెద్ద మొత్తంలో సొమ్ములు తీసుకున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఏదైనా లేఅవుట్‌కు పైపులైన్ వేయాలంటే పురపాలక సంఘం నుంచి అనుమతులు తప్పనిసరి. క్షేత్రస్థాయిలో మున్సిపల్ అధికారులు పరిశీలించిన అనంతరం ఎస్టిమేషన్ ఇస్తారు. దీనికి సంబంధించి చలానా మున్సిపల్ ట్రెజరీలో జమ చేయాలి. కానీ ఇవేమీ పట్టించుకోకుండా సంబంధిత అధికారులు పైపులైన్‌ను సిబ్బందితో వేయించారు.

“కడకట్ల ప్రాంతంలో పైపులైను ఏర్పాటు విషయమై విచారణ చేపడతాం. ఆరోపణలు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.” అని ఇన్‌ఛార్జి కమిషనర్ మురళీకృష్ణ అన్నారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

గణపవరం, న్యూస్‌టుడే: గణపవరం మండల పరిషత్తు సమావేశ మందిరంలో గురువారం పంట కోత ప్రయోగం, ధాన్యం కొనుగోలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు అప్పారావు మాట్లాడుతూ సాధారణ ధాన్యం క్వింటాకు రూ.2300, ఏ గ్రేడ్‌కు రూ.2320 కనీస మద్దతు ధరను ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. వ్యవసాయాధికారి ప్రసాద్ మాట్లాడుతూ రైతులు ధాన్యం విక్రయించిన 24 నుంచి 48 గంటల్లో బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు.

కాశిపాడులో 'పొలం పిలుస్తోంది'

గణపవరం: వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం దోహదపడుతుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు పి.మురళీకృష్ణ అన్నారు. కాశిపాడులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతుల అనుమానాలను నివృత్తి చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

తాడేపల్లిగూడెం	: 79950 67078
పెంటపాడు	: 79939 36123
తణుకు గ్రామీణ	: 85558 50851
అత్తిలి	: 91548 46774

10 AM to 1 PM

తాడేపల్లిగూడెం వన్‌టౌన్,న్యూస్‌టుడే

సమస్య: తాడేపల్లిగూడెం పోలీస్ ఐలాండ్ కూడలిలోని వార్పు రోడ్డు వంతెనపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది.
- శివ, స్థానికుడు

సమాధానం: పరిశీలించి నీరు తొలగించేలా చర్యలు చేపడతాం.
- మురళీకృష్ణ, పురపాలక ఇన్‌ఛార్జి కమిషనర్

సమస్య: తాడేపల్లిగూడెం తితిదే మండపం ఎదురుగా చెత్త పేరుకుని రహదారిపైకి వస్తోంది **- అజయ్, స్థానికుడు**

సమాధానం: చెత్త తొలగించేలా చర్యలు చేపడతాం
- శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పెంటపాడు న్యూస్‌టుడే

సమస్య : పెంటపాడు శ్మశానానికి వెళ్లే మార్గంలో చెత్త, వ్యర్థాలు వేస్తుండటంతో అంత్యక్రియలకు వెళ్తున్న ప్రజలు దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. **- రాజేశ్, గ్రామస్థుడు**

సమాధానం : చెత్త, వ్యర్థాలు తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. **- శోభన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి**

సమస్య : పెంటపాడు మండలం రాచర్లలోని మిడ్ కాలువ రేవులో స్థానికులు చెత్త, తినిపాడేసిన వ్యర్థాలు వేస్తున్నారు.
- ప్రసాద్, స్థానికుడు

సమాధానం : చెత్త, వ్యర్థాలు తొలగిస్తాం.
- వాకా వెంకటదుర్గా భవానీ, సర్పంచి

సామూహిక ఎలుకల నిర్మూలన

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మండలంలోని 20 రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల మందు అందజేశారు. శ్రీనివాసరావు, దాసం ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

వరాల వేంకన్నకు అభిషేకాలు



అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీ వారి లడ్డూ ప్రసాదాల తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించడంతో గురువారం ఈడూరు వరాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించారు. అత్తిలి జనసేన అధ్యక్షుడు దాసం ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పూజల్లో పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు రోడ్డులోని శిర్డీ సాయిబాబా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేపట్టారు.

గోనె సంచులు సరఫరా

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడకుండా నాణ్యమైన గోనె సంచులు సరఫరా చేస్తామని ఇన్‌ఛార్జి తహసీల్దారు బొడ్డు దుర్గాప్రసాద్ తెలిపారు. రావులపర్రులోని రైస్ మిల్లును గురువారం ఆయన పరిశీలించారు. అందుబాటులోని గోనె సంచులు, ఆన్‌లైన్ పోర్టల్ రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై ఆరా తీశారు. మండలంలో ధాన్యం సేకరణకు 20 లక్షల గోనె సంచులు అవసరం ఉంటుందన్నారు.

మహిళ అదృశ్యం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : ఇద్దరి పిల్లలతో మహిళ అదృశ్యమైన సంఘటన తణుకు పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. పైడిపర్రుకు చెందిన ఓ మహిళ ఇద్దరు పిల్లలతో అదృశ్యమయ్యారు. దీనిపై ఆమె భర్త పోలీసులను ఆశ్రయించగా దర్యాప్తు చేపట్టారు.

జల ప్రాంగణం..!



తణుకు ఆర్టీసీ బస్టాండు ఆవరణ



డిపో ముందు బ్యాడ్మింటన్ కోర్టులో చేరిన నీరు

చిన్నపాటి వర్షానికే తణుకు ఆర్టీసీ బస్టాండు జలమయమవుతోంది. లోతట్టు ప్రాంతం కావడంతో మురుగంతా బస్టాండు ఆవరణలో నిలిచిపోతోంది. ఇక్కడ నుంచి మురుగు బయటకెళ్లే మార్గంలోని కాలువలు పూడుకుపోవడంతోనే ఈ దుస్థితి నెలకొంది. నాచుపట్టడంతో దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండు ఆవరణ ఎత్తు పెంచేందుకు ప్రతిపాదనలు పెట్టామని డిపో మేనేజరు గిరిధర్‌కుమార్ తెలిపారు. **-ఈనాడు, తణుకు**



మరుగుదొడ్ల చెంత ఇలా..

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన

పెంటపాడు, న్యూస్‌టుడే : కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం పెంటపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టి తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. రంగారావు మాట్లాడుతూ కౌలు రైతులకు పెట్టుబడి సాయం, యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పుల్లారెడ్డి, కర్రి సాయిరెడ్డి, పెనగంటి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో క్రీడా పోటీలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే : అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలు పురస్కరించుకుని స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల పాఠశాలలో స్పిరిట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథిగా వైద్యుడు నార్ని బావాజీ బహుమతులు అందజేశారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అపహరణపై కేసు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అపహరణకు గురైన సంఘటన కంచుమర్రులో చేపల చెరువు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈడూరుకు చెందిన నంద్యాల రాంబాబు చేపల చెరువు వద్ద కాపలా కాస్తూ జీవనం సాగిస్తున్నారు. 17న కంచుమర్రులోని చేపల చెరువు వద్ద ద్విచక్ర వాహనం ఉంచి కాపలాకు వెళ్లారు. ఉదయం చూడగా ద్విచక్రవాహనం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

ఉపాధి పనుల్లో పారదర్శకత లోపిస్తే చర్యలు

భీమడోలు, న్యూస్‌టుడే: ఉపాధి పనుల్లో పారదర్శకత లోపిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ రాము అన్నారు. భీమడోలు మండలంలో చేసిన పనుల సామాజిక తనిఖీలపై ప్రజా వేదిక గురువారం నిర్వహించారు. మండలంలో ఉపాధి పథకం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా రూ.12.98 కోట్ల విలువైన 1,589 పనులు చేశారు. వాటిపై నిర్వహించిన సామాజిక తనిఖీల్లో పలు అవకతవకలను అధికారులు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పనులకు సంబంధించిన మస్తర్లను మండల స్థాయి అధికారులు పరిశీలించక పోవడం, కొలతల్లో వ్యత్యాసాలు, కూలీల సంతకాలు లేకున్నా వేతనాల చెల్లింపు వంటి తేడాలను గుర్తించిన అధికారులు బాధ్యులైన ఉద్యోగుల నుంచి రూ.90,019 రికవరీ చేయాలని ఆదేశించారు.